ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం సెప్టెంబరు 27, 2024

అధునాతన సాంకేతికతతో ఫోరెన్సిక్ మెడిసిన్
నైపుణ్యం పెంచుకుంటే లక్ష్యాలు సమర్థంగా చేరుకునే వీలు



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి.. చిత్రంలో డా.రఘునందన్, ఫణికిరణ్, లావణ్యకుమారి, పి.ఉమామహేశ్వరరావు, ఎ.విష్ణువర్ధన్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఫోరెన్సిక్ మెడిసిన్ ద్వారా వైద్య విద్య.. మెడికో లీగల్ కేసుల పరిష్కారంలో సమాజానికి ఉపయోగపడే కొత్త పోకడలు, సాంకేతికతను అందరూ అందిపుచ్చుకుని, నైపుణ్యాలు పెంచుకోవాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి సూచించారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో దక్షిణభారత మెడికో లీగల్ అసోసియేషన్ (సిమ్లా) 20వ వార్షిక సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ కళాశాలలోని ఫోరెన్సిక్ మెడిసిన్- టాక్సికాలజీ విభాగం నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల సదస్సులో రాధికారెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతికత, కొత్త పోకడలను అవగతం చేసుకోవాలన్నారు. ఫోరెన్సిక్‌లో మహిళా వైద్యులు మరింత రాణించాలని ఆకాంక్షించారు. అకడమిక్ డీఎంఈ డాక్టర్ జి.రఘునాథ్ మాట్లాడుతూ వైద్య విద్యలో అన్ని సబ్జెక్టులు ఫోరెన్సిక్‌తో మిళితమై ఉంటాయన్నారు. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి పి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ, రోబోటిక్ సాంకేతికత, డిజిటల్ పోస్టుమార్టం కీలక భూమిక పోషిస్తాయన్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా, ఉత్తర భారతదేశ రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా నిపుణులు, విద్యార్థులు హాజరయ్యారు. సిమ్లా నిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు డా.పి.ఉమామహేశ్వరరావు, ఫణికిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ ఉప ప్రధానాచార్యులు ఎ.విష్ణువర్ధన్, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డీపీఎస్ శశి పాల్గొన్నారు.

గోదారమ్మా.. నయనం.. పయనం.. నీవైపు



పట్టాలెక్కనున్న కీలక ప్రాజెక్టులు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఈనాడు, అమలాపురం

ఓ వైపు గోదావరి హొయలు.. మరో వైపు సాగర కెరటాల పరవళ్లు.. ఎంతో ప్రశస్తి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రాలు.. కట్టిపడేసే ప్రకృతి రమణీయత.. వహ్వా అనిపించే ఆహార రుచులు.. ఇది కదా తూర్పుగోదావరి అంటే..ఇక్కడి మనుషులే కాదు పచ్చని వనాలూ ఆప్యాయంగా పలకరిస్తాయి. దేశ విదేశాల నుంచి వచ్చే సందర్శకులు ఓ చక్కని అనుభూతిని ప్రోది చేసుకొని తీయని జ్ఞాపకాలతో వెనుదిరుగుతుంటారు. వైకాపా సర్కారు గత అయిదేళ్లూ ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రగతిని విస్మరించింది.. కూటమి ప్రభుత్వం వచ్చాక కీలక ప్రాజెక్టులకు నడుంబిగిస్తోంది. వాటి సంగతి చూద్దామా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు, పట్టిసీమ, పేరుపాలెం బీచ్‌ను అనుసంధానం చేస్తూ రూ.100 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టును కేంద్ర నిధులతో పట్టాలెక్కిస్తున్నారు. ఆధ్యాత్మిక, పర్యావరణ (ఎకో), నదీ (రివర్) పర్యాటకాన్ని మేళవిస్తారు. సందర్శకులు కనీసం నాలుగు రోజులు బస చేసే లక్ష్యంతో ప్రణాళికలు తయారుచేస్తున్నారు. వచ్చేనెల 15వ తేదీలోగా కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు డీపీఆర్ అందనుంది. ఆమోదం లభిస్తే 4 వేల మందికి ఉపాధి కూడా లభిస్తుంది.



హేవలాక్‌పై నుంచి బంగీ జంప్..

రాజమహేంద్రవరానికి మణిహారమైన హేవలాక్ వంతెన, గోదావరి మధ్యలో ఉన్న బ్రిడ్జి లంకను అనుసంధానం చేస్తూ ప్రత్యేక ప్రాజెక్టు రూపొందిస్తున్నారు. బ్రిడ్జిలంకలో జల, సాహస క్రీడలు... హేవలాక్ వంతెన పైనుంచి గోదావరిలోకి బంగీ జంప్ తదితర ఆకర్షణలు ఉంటాయి. అనంతరం హేవలాక్‌పై నుంచి సుమారు కి.మీ మేర నడిచి రేవులోకి చేరుకునేలా పర్యాటక శాఖ ప్రణాళికలు తయారుచేసింది. ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఈ ఏడాది చివరి నాటికి ఏర్పాటవుతుంది.

రూ.11 కోట్లతో తీర సొగసులు

కాకినాడలో 2018లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం స్వదేశీ దర్శన్‌లో భాగంగా రూ. 47.50 కోట్లతో సముద్రతీరాన్ని అభివృద్ధి చేసింది.. వైకాపా వచ్చాక నిర్వహణ గాలికి వదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వం రూ. 11 కోట్లతో వాటర్ పార్కు, ట్రెక్కింగ్, పాంట్‌లైన్లు, రెస్టారెంట్లు ఏర్పాటుచేస్తోంది. దసరా నాటికి అందుబాటులోకి తీసుకొస్తారు. గతంలో రోజుకు సగటున సముద్ర తీరానికి 1700 మంది వస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య పెరగనుంది.


కాకినాడ సముద్రతీరాన్ని మునుపటిలా తీర్చిదిద్దేందుకు పనులు

రెండురోజుల ఆధ్యాత్మిక యాత్ర

ఉభయ గోదావరి జిల్లాల్లోని 8 నుంచి 10 ఆధ్యాత్మిక క్షేత్రాలను కలుపుతూ ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేకంగా బస్సులు నడపాలన్న మంత్రి దుర్గేష్ ఆలోచనను పర్యాటక శాఖ రవాణా విభాగం పట్టాలెక్కించే పనిలో ఉంది. రెండురోజులపాటు వివిధ ప్రాంతాలు సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

కడియం అందాల వీక్షణ..



కడియం నర్సరీలను సందర్శకులు వీక్షించేలా ప్రాజెక్టులు రాబోతున్నాయి. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ ప్రశాంతి తదితరులు నర్సరీ ప్రతినిధులు, పర్యాటక అధికారులతో చర్చించారు. ధవళేశ్వరం బ్యారేజీ వెనుక నుంచి కడియపులంక పూల మార్కెట్ వరకు బోటింగ్, ఆ పరిధిలోని గోదావరి గట్టు సుందరీకరణ చేపడతారు. నర్సరీల గుండా నడిచి చూసేలా బ్యాటరీ వాహనాల్లో సందర్శకులు వెళ్లేలా ఆలోచన చేస్తున్నారు. కొన్ని అద్భుతాల నేపథ్యంలో 500 మీటర్ల మేర జిప్‌లైన్ వేస్తారు. ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

బోటుపై హాయిహాయిగా..


ఆదుర్రు బోటింగ్ టెర్మినల్


కోనసీమలోని ఆదుర్రు, పాసర్లపూడి, కోటిపల్లి ప్రాంతాల్లో బోటు షికారు గత కొన్నాళ్లుగా మూలనపడింది. త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆదుర్రులో టెండర్లు పిలుస్తున్నారు. పాసర్లపూడిలో ఓ లడీపీ విధానంలో నిర్వహణకు చర్యలు చేపట్టారు. ● ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి ఆనుకుని పిచ్చుకలంక వద్ద 56 ఎకరాల విస్తీర్ణాన్ని ఒబెరాయ్ ప్రతినిధులు పరిశీలించారు. రిసార్టులు, రెస్టారెంట్‌లు ఏర్పాటుకానున్నాయి. జల, సాహస క్రీడలూ ఉంటాయి.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం..

ప్రస్తుత ప్రభుత్వం పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అవకాశం ఉన్న ప్రతి వనరునూ సద్వినియోగం చేసుకుంటాం. అఖండ గోదావరి ప్రాజెక్టును పుష్కరాల లోగా పూర్తిచేస్తాం. కాకినాడలో వాటర్ పార్కు దసరాలోపు, ఇతర పనులు డిసెంబరుకి పూర్తి చేస్తాం.

-స్వామినాయుడు, పర్యాటకశాఖ ఆర్జేడీ, రాజమహేంద్రవరం

పులి జాడ.. లంకంతా జల్లెడ
చిరుతను పట్టుకునేందుకు త్రిముఖ వ్యూహం


చిరుత పాదముద్రలు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, కడియం: మొన్నటివరకు దివాన్ చెరువు.. ఇప్పుడు కడియం వనాలు.. చిరుత సంచారం కలకలం సృష్టిస్తోంది. గోదావరి లంకల్లోకి వెళ్లిపోయి ఉంటుందని అంచనా వేసినా అందుకు భిన్నంగా కడియపులంక పరిసరాల్లోనే సంచరిస్తున్నట్లు గురువారం లభించిన పాదముద్రలతో స్పష్టమైంది. ఓ నర్సరీ మెట్ల వద్ద తుప్పలను బట్టి ఇది వెలుగుచూసింది.

చుట్టూ ఎర వేసి..

గోదావరి వరదల్లోనే ఈ చిరుత వచ్చిందని.. ఆదే మార్గం లోనే వెళ్తుందని భావిస్తున్నామని.. లేకుంటే బోనులో ఎరవేసి తప్పనిసరైతే మత్తు ఇంజక్షన్ ఇచ్చి బంధిస్తామని డీఎఫ్‌వోలు ఎస్.భరణి, ప్రసాదరావు వెల్లడించారు. బుధవారం రాత్రి లంకల వైపు వెళ్లిందని, వర్షం కురవడంతో తిరిగి వెనక్కి కడియపులంక వచ్చేసిందన్నారు.

రెండు బోనులు.. 10 మేకలు..

చిరుతను బంధించేందుకు 60 మంది అటవీ సిబ్బంది పరిశీలన చేస్తున్నారు. 20 ట్రాప్ కెమెరాలు, నాలుగు సీసీ కెమెరాలతో నిఘా ఉంచి.. డ్రోన్‌తోనూ జల్లెడ పట్టారు. రెండు బోనులు, అందులో ఎరగా ఒక్కో మేక, సమీపంలో 8 మేకలను కట్టారు. బోనులోకి వెళ్లకపోతే.. లేకుంటే మేకపై దాడి చేసే తరుణంలో మత్తు ఇంజక్షన్ ఇచ్చేలా ప్రణాళిక చేశారు.


కడియపులంక నర్సరీలో అన్వేషిస్తున్న అటవీ అధికారులు

కూలీల ఉపాధిపై ప్రభావం..

కడియపులంక నర్సరీలలో 25 వేల మంది నిత్యం పనులకు వస్తుంటారు. చిరుతతో ఉపాధి కరవైంది. ఎగుమతులు నిలిచి రవాణా రంగంపైనా ప్రభావం కనిపిస్తోంది. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ రైతుల సంఘానికి చెందిన మల్లు పోలరాజు మాట్లాడుతూ ఈ సీజన్‌లో రోజూ 70 నుంచి 90 లారీల మొక్కలు ఎగుమతి అవుతాయన్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య సగానికి పడిపోయిందన్నారు. రైతులు రూ.కోటి మేర నష్టపోయారన్నారు.

ప్రజలు సహకరించాలి

కడియపులంక పరిసరాల్లోనే చిరుత ఉన్నట్లు నిర్ధారణ చేసుకున్నాం. సురక్షితంగా బంధించేందుకు ఏర్పాట్లు చేశాం. నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు సహకారం అందిస్తున్నారు. ట్రాప్ కెమెరాలు, డ్రోన్ తిరిగే సమయంలో ప్రజలు ఉంటే చిరుత హడలిపోయి దాడి చేసే ప్రమాదం ఉంది. ఎవరూ అటువైపు రాకూడదు. స్థానికులు సహకరిస్తే ఎవరికీ ఇబ్బంది లేకుండా చిరుతను బంధిస్తాం.

-ఎస్.భరణి, ఎంవీ ప్రసాదరావు, డీఎఫ్‌వోలు

బాలబాలాజీ ప్రసాదానికి మారిన నెయ్యి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానంలో లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి మార్చారు. ఇక్కడ ఇన్నాళ్లూ రైతు డెయిరీ నెయ్యి ఉపయోగిస్తున్నారు. రుచి లేకపోవడం, తగిన నిల్వ ఉండకపోవడంతో భక్తుల నుంచి అసంతృప్తి వ్యక్తమైంది. ఇటీవల పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆలయానికి వెళ్లి లడ్డూ, నెయ్యి డబ్బాలను పరిశీలించి నాణ్యతపై అసంతృప్తి వ్యక్తంచేశారు. రైతుడెయిరీ స్థానే నాణ్యత ఉన్న నెయ్యిని ఉపయోగించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను కోరారు. దీంతో ప్రస్తుతం విశాఖ నెయ్యి ఉపయోగిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు.

సీమంతం.. వైభోగం


అంగర: కపిలేశ్వరపురం మండలం వల్లూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు కిరీటధారణతో ఇలా సీమంతాలు నిర్వహించారు.

విద్యార్థులకు ఆరోగ్య బీమా సౌకర్యం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యార్థులకు ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులు, వైద్యారోగ్య, స్త్రీశిశు సంక్షేమశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించే వసతిగృహాల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు ఐసీఐసీఐ లాంబార్డ్ కంపెనీతో ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని, దీనికి సంబంధించి విద్యార్థులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. వసతిగృహాలు, అనాథాశ్రమాల్లో పాము కాటు, కల్తీ ఆహారం వంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు తక్షణ వైద్య సాయం అందించేందుకు ఈ బీమా ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై దాడులు అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అత్యవసర వైద్యసేవల విభాగాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కలెక్టరేట్ నుంచి నిర్వహించే కంట్రోల్ రూంకు అనుసంధానం చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి దుర్గారావు దొర, డీసీహెచ్ఎస్ కార్తిక్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి జ్యోతిలక్ష్మి, ఐఎంఏ సభ్యులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

కార్యాలయం.. స్నేహపూర్వకం

జిల్లాకేంద్రం అమలాపురం పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక ఛాంబర్ సదుపాయం అమల్లోఉండేది. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఛాంబర్ల తొలగింపు పనులు పూర్తయ్యాయి. మరిన్ని మార్పులుచేసి దీనిని స్నేహపూర్వక కార్యాలయంగా అందుబాటులో తీసుకురానున్నారు. ఇక్కడికి వచ్చేవారు ఇకపై ప్రత్యేక ఛాంబర్ ముందు బెరుకుగా నిల్చోవాల్సిన పనిలేదు. ప్రభుత్వ సూచనల మేరకు ఎక్కువ సమయం వేచి ఉండే ఆస్తుల క్రయవిక్రయదారులకు తాగునీరు, వీలైతే టీ అందించాలని మార్గదర్శకాలున్నాయి.


ప్రస్తుతం ఛాంబర్ ఇలా..

- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ప్రగతి పథం.. నిధుల వరం
ఎస్‌డీఆర్ఎఫ్ నుంచి జిల్లాకు రూ.18 కోట్లు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా గుంతల రోడ్లపై ప్రయాణం సాగించేందుకు గత అయిదేళ్లలో ప్రజలు పడరాని పాట్లుపడ్డారు. ఏ ఒక్క రహదారి మరమ్మతులకు గత వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయనేలేదు. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. గతంలో కొన్ని రహదారులను అభివృద్ధిచేసినా వాటికి నేరుగా కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చింది. వాటిని కూడా దారి మళ్లించి ఇతర పథకాలను వినియోగించి గుత్తేదారులకు వైకాపా ప్రభుత్వం వేదన మిగిల్చింది.


మండపేట-ఆలమూరు రోడ్డులో గుంతలు

కూటమి ప్రభుత్వం రాకతో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందుబాటులో ఉంటున్న నిధులను వినియోగించి ప్రజల కనీస అవసరాలు తీరేలా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి(ఎస్‌డీఆర్ఎఫ్) నుంచి జిల్లాకు రూ. 18 కోట్లు మంజూరు చేశారు. వీటితో మొత్తం 395 కి.మీ. మేర రహదారుల్లో గుంతల పూడ్చివేత, అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని రాష్ట్ర ప్రధాన రహదారుల్లో అధ్వానంగా ఉన్న 90 కి.మీ. మేర రోడ్డులో గుంతల పూడ్చివేత, 51 కి.మీ.లలో అత్యవసర మరమ్మతులు పూర్తి చేయనున్నారు. ప్రధాన రహదారుల్లో ధ్వంసమైన రోడ్లలో 150 కి.మీ.లలో అత్యవసర మరమ్మతులు, 104 కి.మీ. మేర రహదారుల్లో గుంతలు పూడ్చనున్నారు. ఇవన్నీ జిల్లాలోని ప్రధాన రహదారులు. వీటిపై నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు.


శివకోడు-విశ్వేశ్వరరాయపురం ప్రధాన ర.భ.శాఖ రోడ్డు దుస్థితి

వివరాలు ఇవీ..

రహదారులు	గుంతల పూడ్చివేత (కి.మీ)	నిధులు (రూ. కోట్లు)	అత్యవసర మరమ్మతులు (కి.మీ.)	నిధులు (రూ. కోట్లు)
రాష్ట్ర ప్రధాన	90	1.30	51	1.35
జిల్లా ప్రధాన	104	3.47	150.8	11.56

టెండర్లు పిలిచాం

జిల్లావ్యాప్తంగా ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో నిర్వహించే రహదారుల పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పిలిచాం. అక్టోబరు 10న టెండర్లు తెరుస్తాం. దక్కించుకున్న గుత్తేదారులతో వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి రహదారులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం.

- రాము, ఆర్అండ్‌బీ ఈఈ

గోడి గురుకులం.. ఇక్కట్లు యథాతథం

న్యూస్‌టుడే, అల్లవరం

గోడి గురుకుల బాలుర పాఠశాల్లో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. గతేడాది హైకోర్టు మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖను ఆదేశించింది. దీంతో రూ. 80 లక్షలతో వసతులకు శ్రీకారం చుట్టారు. నేటికీ ఇబ్బందులు అలానే ఉన్నాయి.

ఆహారం.. నాసిరకం

భోజనాలు సరిగా ఉండడం లేదని, కూరలు సరిగా వండడం లేదని, రెండ్రోజులుగా ఉల్లిపాయలు వాడడం ఇక్కడున్న 450 మంది విద్యార్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం పాఠశాలలో డీసీవో, స్థానిక తహసీల్దారు తనిఖీలు నిర్వహించారు. లోపాలు గుర్తించారు.జిల్లాలోని గురుకులాలకు కిరాణా సామగ్రి రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ నుంచి వస్తాయి. పాలు విశాఖ డెయిరీ, కోడిగుడ్లు, కూరగాయలు సరఫరా చేసే పనులు అమలాపురం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి దక్కించుకున్నారు. వీరు ప్రతిరోజూ పాఠశాలలకు పంపే సరకుల్లో నాణ్యత లేకపోవడంతో ఆహారం తినలేకపోతున్నామని విద్యార్థులంటున్నారు.


పురుగులు వచ్చిన ఉప్మా రవ్వ

కుళ్లిన ఉల్లి.. నూకలో పురుగులు

గుత్తేదారు సరఫరా చేసిన ఉల్లిపాయలు చాలావరకు కుళ్లాయి.ఉప్మా నూకలో పురుగులున్నాయి. పది రోజులుగా కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు రాలేదని, ఉన్నవాటితోనే కూరలు వండుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. బుధవారం బంగాళాదుంప కూర రసంలా ఉండటంతో తినలేక పడేశామని విద్యార్థులన్నారు.

● పాఠశాల ఆవరణలో మరుగుదొడ్లు లేవు. అత్యవసరమైతే వసతిగృహంలోకి వెళ్లాల్సివస్తోంది. ● కొన్నేళ్లుగా ఈ పాఠశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్ లేరు. గత ప్రభుత్వంలో భోజనాలకు సొంత డబ్బు వెచ్చించే పరిస్థితి నెలకొనడంతో ప్రిన్సిపల్‌గా బాధ్యతలకు ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొంది.


వంటల నాణ్యత పరిశీలిస్తున్న డీసీవో వెంకట్రావు

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

సమస్యలపై గురువారం పరిశీలించాం. మరుగుదొడ్లు బాగు చేయిస్తాం. మెనూ అమలు చేస్తాం. గుత్తేదారులకు నోటీసులిస్తాం.

- జి.వెంకట్రావు, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా సమన్వయాధికారి

ఈవీఎం గోదాము వద్ద పటిష్ఠ భద్రత

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం), వీవీ ప్యాట్‌లను భద్రపర్చిన గోదాము వద్ద పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ముమ్మిడివరం ఎయిమ్స్‌లోని ఈవీఎం గోదామును రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గురువారం తాళాల సీళ్లను పరిశీలించి, తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా మూడు నెలలకోసారి ఈవీఎం గోదాములను పరిశీలించి నివేదిక పంపించాల్సిఉంటుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, వడ్డి నాగేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ముమ్మిడివరం తహసీల్దారు సుబ్బలక్ష్మి, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు వెంట ఉన్నారు.

లక్ష్యం అద్భుతం.. నిర్వహణ అధ్వానం


అమలాపురంలోని డిజిటల్ గ్రంథాలయం


గేటు ఎదురుగా నిలిచిన మురుగు నీరు

జిల్లా కేంద్రమైన అమలాపురంలోని అశోక్‌నగర్‌లో బీఆర్ అంబేడ్కర్ డిజిటల్ గ్రంథాలయ భవనాన్ని రూ. 24 లక్షలతో నిర్మించారు. ప్రారంభించి ఏడాది కాకుండానే భవనం అస్తవ్యస్తంగా తయారైంది. భవనంపై గ్రంథాలయం పేరు కూడా సరిగా లేదు. ముందర మురుగు వెళ్లే దారి లేక అధ్వానంగా ఉంది. భవనంలో వర్షపు నీరు కిందికొస్తూ పిల్లర్ల (స్తంభాల) లోంచి దిగుతోంది. లోపల శుభ్రం చేయకపోవడంతో రెండో అంతస్తు బురదమయంగా మారింది. నిరుద్యోగ యువత ప్రభుత్వ కొలువులు సాధించాలని గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలతోపాటు అంతర్జాలం ఉపయోగిస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కంప్యూటర్లు ఉన్న రెండో అంతస్తులో నీరు చేరకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అధికార పార్టీ కౌన్సిలర్లు, అధికారుల పర్యవేక్షణ కరవై గుత్తేదారు భవనాన్ని ఎలా నిర్మించారనేది ఎవరూ పట్టించుకోలేదు. దీనిపై మున్సిపల్ ఏఈ భాస్కరరావును అడుగగా గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి గుత్తేదారుతో మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.


భవనం రెండో అంతస్తులో ఇలా..

- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం



బడికెళ్లాలా.. గెంతు..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం సమీప మండలం ఉప్పలగుప్తంలో రహదారులు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. గత ప్రభుత్వం రహదారులను పట్టించుకోకపోవడంతో గ్రామస్థులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షాలకే రహదారులు చిత్తడిగా మారడంతో చిన్నారులు బడికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గురువారం చీకట్లపాలెం పాఠశాల విద్యార్థులు పుస్తకాల సంచులు మోసుకుంటూ వరుస క్రమంలో అతికష్టంమీద బురదను దాటుకుంటూ వెళుతున్న పరిస్థితి కనిపించింది. కూటమి ప్రభుత్వం ఉప్పలగుప్తం నుంచి పేరాయిచెరువు వరకు రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

బాహుబలి బొంతు

కాకినాడ సముద్ర జలాల్లో వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు సుమారు వంద కేజీల భారీ బొంతు చేప చిక్కింది. గురువారం కుంభాభిషేకం రేవులో అమ్మకానికి పెట్టగా వ్యాపారి సత్తిబాబు రూ.19 వేలకు కొనుగోలు చేశారు. ఈ చేపలను బెంగళూరు వంటి పెద్ద నగరాల్లోని రెస్టారెంట్లలో అధికంగా వినియోగిస్తారని మత్స్యకారులు తెలిపారు. గత అయిదేళ్లలో ఇంత భారీ చేప దొరకలేదన్నారు. ఇవి తీరానికి చాలా దూరంలో ఉంటాయని, తుపాను సమయంలో దగ్గరగా వస్తాయని తెలిపారు.


- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)



ఈ నిర్లక్ష్యానికి లేదా అంతు?

మామిడికుదురు మండలం పాశర్లపూడి నుంచి నగరం వరకు 216 జాతీయ రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలను తొలగించకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. ప్రమాద మలుపులు, శిథిల కల్వర్టులను వాహన చోదకులు గుర్తించేందుకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తుప్పల్లో కూరుకుపోయినా ఎవరికీ పట్టడంలేదు. సత్వరమే వీటిని గుర్తించి చక్కదిద్దేలా చర్యలు చేపట్టాలని చోదకులు విన్నపాలు చేస్తున్నారు. సమస్యను చక్కదిద్దుతామని సంబంధిత ఏఈఈ పురుషోత్తం తెలిపారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు



సంక్షేమంతో పాటు అభివృద్ధి వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీ హరీష్ మాధుర్

రాజోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. పొదలాడలో గురువారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. రాజోలులో త్వరలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. గత వైకాపా ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని ముంచిందని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రుద్రరాజు పద్మరాజు, చిటికెన రామ్మోహనరావు, గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, దాగంటి స్వామి, గుబ్బల శ్రీనివాస్, సూరిశెట్టి శ్రీనివాస్, సర్పంచి కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, పోలమూరి శ్యాంబాబు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక బదిలీలపై గ్రామ సర్వేయర్ల ఆవేదన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా నుంచి 20 మంది గ్రామ సర్వేయర్లను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేశారని, దీనిపై దీనిని పునః పరిశీలన చేయాలని వారంతా కోరారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత పరిపాలన సౌలభ్యం పేరుతో ఆ జిల్లాలో నియమించడం దారుణమన్నారు. కాకినాడ జిల్లాలో గ్రామ సర్వేయర్ల కొరత ఉందని చూపి, అక్కడి నుంచి 12 మందిని ఇక్కడ ఎలా నియమించారో అర్థంకావడం లేదన్నారు. అనంతరం జేసీ రాహుల్‌మీనాకు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. గ్రామ సర్వేయర్ల బదిలీ ఉత్తర్వులను పునర్ పరిశీలించాలని సీఐటీయూ నాయకుడు పలివెల వీరబాబు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

భీమేశ్వరాలయ హుండీల లెక్కింపు



లెక్కిస్తున్న గ్రామస్థులు, సిబ్బంది

ద్రాక్షారామ, న్యూస్‌టుడే : ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారి హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ ఏడాది ఆగస్టు 3 నుంచి ఈ నెల 26వ తేదీ వరకుగల 54 రోజులకుగాను రూ.37,30,774 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎన్.వి.దుర్గాభవాని తెలిపారు. అన్నదాన ట్రస్టు హుండీ ఆదాయం రూ.77,562 వచ్చింది. మొత్తం కలిపి రూ.38,08,336 ఆదాయం సమకూరినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమాన్ని రామచంద్రపురం డివిజన్ దేవాదాయశాఖ తనిఖీ అధికారి ఆర్.బాలాజీ రాంప్రసాద్ పర్యవేక్షించారు. గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చమురు ఉత్పత్తుల తరలింపులో రక్షణ చర్యలు చేపట్టాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కోనసీమ వ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సంస్థలు తమ ఉత్పత్తుల తరలింపులో పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, జిల్లా అగ్నిమాపక అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఓఎన్జీసీ, కెయిర్న్ ఎనర్జీ, గెయిల్ సంస్థలు తమ పైపులైన్‌లలో ఏర్పడే లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలన్నారు. గ్యాస్, చమురు సరఫరా చేసే పైపులైన్లున్న ప్రాంతాల వివరాలను జిల్లా అగ్నిమాపక అధికారికి ఇవ్వాలని చమురు సంస్థల ప్రతినిధులకు సూచించారు. జిల్లా విపత్తుల నిర్వహణాధికారి పార్థసారథి, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా మేనేజర్ సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్‌బాబు

ధవళేశ్వరం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ధవళేశ్వరంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రీ అరెస్టు, రిమాండు, పోక్సో చట్టం తదితర అంశాలపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి హాజరైన పోలీసు, రెవెన్యూ, ఎన్‌జీవోలకు అవగాహన కల్పించారు. ప్రీ అరెస్టు, రిమాండు దశలో నిందితులకు అందుబాటులో ఉన్న న్యాయసేవల గురించి వివరించారు. నిందితులను అదుపులోకి తీసుకొనే కారణాలను కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. అరెస్టు అయిన వ్యక్తికి విచారణ సమయంలో తనకు నచ్చిన న్యాయవాదిని కలిసే హక్కు ఉందన్నారు. న్యాయవాది లేకపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుంచి సేవలు పొందచ్చన్నారు. పోక్సో చట్టంలో వివిధ అంశాలను వివరించారు. లైంగిక వేధింపులు, ఇతర నేరాల మహిళా బాధితులకు నల్సా ద్వారా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందించే పరిహారాన్ని వివరించారు. సదస్సులో అల్లూరి జిల్లా ఏఎస్పీ జగదీష్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జె.మహేష్, డీఎస్పీలు భవ్యకిషోర్, కె.వెంకటేశ్వరరావు, ధవళేశ్వరం సీఐ టి.గణేష్ పాల్గొన్నారు.

జిల్లాలో ఆర్డీవోలు బదిలీ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ముగ్గురు ఆర్డీవోలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అమలాపురం ఆర్డీవోగా కె.మాధవి రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన కేశవర్ధన్‌రెడ్డిని కనిగిరి ఆర్డీవోగా బదిలీ చేశారు. కొత్తపేట ఆర్డీవోగా పి.శ్రీకర్ వస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను పరిపాలనా విభాగం(జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రామచంద్రపురం ఆర్డీవోగా ఖతీబ్‌కౌషర్ బానో కడప నుంచి వస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుధాసాగర్‌ను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఫోరెన్సిక్ పరీక్షల్లో కృత్రిమ మేధ.. రోబోటిక్ సాంకేతికత

● కొత్త పోకడలతో సమర్థంగా నేరశోధన, కేసుల పరిష్కారం ● సిమ్లా- 2024 సదస్సులో నిపుణుల మనోగతం

ఈనాడు, కాకినాడ – న్యూస్‌టుడే, మసీదు సెంటర్: ఫోరెన్సిక్ వైద్య పరీక్షల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్, డిజిటల్ పోస్టుమార్టం వంటి సాంకేతికతలను వినియోగించుకుంటే.. నేర పరిశోధన, కేసుల పరిష్కారం మరింత సులభతరం అవుతాయని ఫోరెన్సిక్ వైద్య నిపుణులు పేర్కొన్నారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసీ) ఆడిటోరియంలో 'సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (ఎస్ఐఎంఎల్ఏ) 20వ వార్షిక సదస్సు గురువారం ప్రారంభమయ్యింది. ఆర్‌ఎంసీలోని ఫోరెన్సిక్ మెడిసిన్- టాక్సికాలజీ విభాగం నిర్వహించే మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి ఫోరెన్సిక్, మెడికోలీగల్, ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు హాజరయ్యారు. తమ అనుభవాలను ఆహుతులతో పంచుకోవడంతో పాటు.. ఎదురవుతున్న సవాళ్లు, అధిగమించే దిశగా అందిపుచ్చుకోవాల్సిన నైపుణ్యాలు ఇతరత్రా అంశాలను వివరించారు.

శరీరానికి కోత లేకుండా కారణం చెప్పొచ్చు



కేసుల పరిష్కారంలో పోస్టుమార్టం కీలకం. ప్రపంచం, సాంకేతికత అంచనాలకు అందనంత వేగంగా మారిపోతున్నాయి. దానికి వేగంగా మనమూ వెళ్లాల్సిన అవసరం ఉంది. అందుబాటులోకి వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఫోరెన్సిక్‌లో ఎలా వినియోగించుకోవాలి..? కేసులను సమగ్ర పరిష్కారం ఎలా చూపాలి..? కేసుల పరిష్కారంలో పోలీసులు, న్యాయవ్యవస్థకు ఎంతవరకు ఈ సాంకేతిక ఉపయోగపడుతుందో దృష్టిసారించాం. మృతదేహం శరీరం కోయకుండానే పోస్టుమార్టం చేసే ప్రయోగాలు జరుగుతున్నాయి.

- డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి, సిమ్లా ఆర్గనైజింగ్ చైర్మన్

వాస్తవాలు తెలుసుకునే వీలు



చావుకు కారణాలు తెలుసుకోవడానికి కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. మన ఊహకు అందని వాస్తవాలు కూడా సాంకేతికతతో తెలుసుకునే వీలుంది. ఫోరెన్సిక్ విభాగంలో నిపుణులకు ఇలాంటి సదస్సులు ప్రత్యేకంగా ఉపకరిస్తాయి. నిష్ణాతులైన ఫోరెన్సిక్ వైద్యనిపుణులు వచ్చి తమ అనుభవాలను వివరిస్తున్నారు.

- డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, వైస్‌ప్రిన్సిపల్, రంగరాయ వైద్యకళాశాల

మృతదేహానికి పాముతో కాటేయించారు..



న్యాయవ్యవస్థలో ఎన్నో కేసుల పరిష్కారానికి ఫోరెన్సిక్ విభాగం ఎంతగానో దోహదపడుతోంది. పాముకాటుతో చనిపోయినట్లు ఓ మృతదేహం పోస్టుమార్టం కోసం వచ్చింది. కరిచిన పామును సైతం చంపి తీసుకొచ్చారు. మృతదేహాన్ని పరీక్షిస్తే ఆమె గుడ్డతో పీకకు బిగించడం వల్ల చనిపోయిందని, ఆ తర్వాత పాముతో కాటు వేయించారని తేలింది. ఒక్కోసారి మృతికి కారణాలు పోలీసులకు కూడా తప్పుగా వస్తాయి. సాక్ష్యాలు తారుమారు చేయడానికి కొందరు నిందితులు ప్రయత్నిస్తారు. ఒక్కోసారి ఒక మనిషి అనుమానాస్పదంగా చనిపోతే దానిపై భిన్న వాదనలు వినిపిస్తాయి. మృతికి కారణం పరీక్షల ద్వారా వెల్లడించొచ్చు.

- డాక్టర్ జయంతి యాదవ్, ఫోరెన్సిక్ నిపుణులు, ఏఐఐఎంఎస్, భోపాల్, మధ్యప్రదేశ్

నమూనాల సేకరణే కీలకం..



శవ పరీక్ష ద్వారా ఎలా చనిపోయాడు, ఎలా చంపబడ్డాడు.. చనిపోయి ఎన్నిరోజులైంది.. కారణం ఏమిటి..? ఇలాంటి సమాచారం ఫోరెన్సిక్ పరీక్ష ద్వారా నిర్ధారించే వీలుంది. స్పృహతప్పి పడిపోయి చనిపోయిన కేసులు వస్తే గుండెనొప్పితో చనిపోయాడా..? విష ప్రయోగం జరిగిందా..? ఇతరత్రా కారణాలను గుర్తించొచ్చు. ఈ వివరాలు నేర పరిశోధనకు ఉపకరిస్తాయి. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా నివేదికలు ఉండాలి. నమూనాల సేకరణలు, పరీక్షల్లో వాస్తవికత కీలకం. లోపాలకు ఆస్కారం ఉండకూడదు.

- డాక్టర్ బి.శాంతకుమార్, ఫోరెన్సిక్ మెడిసిన్ మాజీ డైరెక్టర్, తమిళనాడు


బాంబు ఎవరు పేల్చారో తెలిసిపోతుంది..



ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఏఐ ద్వారా నిందితులను, గుర్తుతెలియని మృతదేహాలను తెలుసుకోవచ్చు. ఉదాహరణకు బాంబు పేలుడు జరిగిన చోట నిందితుడు క్యాప్ పెట్టుకుని, మాస్క్ పెట్టుకుని బ్లాస్ట్ ముందు ఆ ప్రదేశాల్లో తిరుగుతూ ఉంటాడు. అలాంటి సమయంలో అతని కళ్లు మాత్రమే కెమెరాకు చిక్కుతాయి. ఆ కళ్లు, నుదురు, మొహంలోని కొలతల ఆధారంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో నిందితుడిని కనిపెట్టవచ్చు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఒక్క కర్ణాటకలో మాత్రమే ప్రైవేటు ఆసుపత్రుల్లో పోస్టుమార్టం నిర్వహిస్తారు. కేసుల ఛేదనలో ఫోరెన్సిక్ పాత్ర కీలకం.

- డాక్టర్ బృంద జె.బట్, శ్రీనివాస్ వైద్య కళాశాల మంగుళూరు, కర్ణాటక

నేరాల్లో వేలిముద్రలు దారి చూపుతాయి...



అది సహజ మరణమని తెలిసినా.. ఆ దెబ్బలకు వేరే కారణం ఉందా అనేది ఫోరెన్సిక్ పరీక్షలతో చెప్పగలం. హత్య, ఇతరత్రా కేసుల్లో ఎముకల ద్వారా వయసు, లింగ నిర్ధారణ.. అత్యాచారం కేసుల్లో నమూనాల సేకరణ ద్వారా నేర నిర్ధారణకు అవకాశం ఉంది. ఏదైనా కేసును ఛేదించాలంటే.. ఒక వేలి ముద్రను మన దగ్గరున్న వెయ్యి వేలిముద్రలతోనే సరిపోల్చుతాం. దీనికి చాలా రోజులు పడుతోంది. అడ్వాన్స్‌డ్ డీప్ లెర్నింగ్, మిషన్ లెర్నింగులతో అన్ని నెట్‌వర్క్‌లతో అనుసంధానం చేస్తే క్షణాల్లో ప్రపంచంలోని అన్ని వేలిముద్రలతో పోల్చి కచ్చితమైన ఫలితం ఇస్తుంది.

- డాక్టర్ ఎస్వీ ఫణీంద్ర, ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణులు, ఎన్ఆర్ఐ వైద్యకళాశాల, గుంటూరు

వీఐఏలో 44 మందికి పాజిటివ్

ముగిసిన సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.సమత

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల క్యాంపు గురువారంతో ముగిసింది. 350 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్య కుమారి తెలిపారు. విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ ఎసిటిక్ యాసిడ్(వీఐఏ) పరీక్షల్లో 44 మందికి పాజిటివ్‌గా తేలిందన్నారు. 43 మందికి వైద్యసేవలు అందజేయగా.. ఒకరిని బయాప్సీ పరీక్ష చేయించుకోవాలని సూచించామన్నారు. వీఐఏ పరీక్ష, థర్మల్ కోయాగ్యులేషన్ చికిత్సపై స్థానిక వైద్యులు, నర్సులు, పీజీ వైద్యవిద్యార్థులకు అమెరికా బృందం శిక్షణ ఇచ్చిందన్నారు. థర్మల్ కోయాగ్యులేషన్ పరికరాన్ని అమెరికా నిపుణులు ఆసుపత్రికి అందజేశారన్నారు. క్యాంపు ముగింపు సందర్భంగా అమెరికా వైద్యబృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ సన్మానించారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన పీఐఎన్‌సీసీ ప్రెసిడెంట్ జీన్ టాల్బర్ట్ ఫాకోగ్, పీఐఎన్‌సీసీ భారత ప్రతినిధి డా.సమత కడియాల, అమెరికాకు చెందిన డా.సుసాన్ కోక్రాన్, డా.కరోల్ హాబాచ్, జీజీహెచ్ రేడియేషన్ హెచ్‌వోడీ డా.పి.శ్రీనివాసన్, గైనిక్ హెచ్‌వోడీ డా.అనురాగమయి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ అక్రమ రవాణా అరికట్టాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెట్రోలు బంకుల యజమానులు

అమలాపురం కలెక్టరేట్: కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుంచి కోనసీమకు అక్రమ మార్గంలో కొందరు సాగిస్తున్న ఆయిల్ రవాణాను అరికట్టాలని పెట్రోలు బంకుల డీలర్లు గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇదే సమస్యపై ఫిర్యాదు ఇచ్చినా ఇప్పటివరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదని వాపోయారు. ధరల్లో వ్యత్యాసం ఉండటంతో అక్రమ వ్యాపారులు బంకుల కన్నా తక్కువకు ఆక్వా చెరువుల యజమానులకు డీజిల్ సరఫరా చేస్తున్నారని, దీంతో తాము నష్టాల పాలవుతున్నామన్నారు. తక్షణం అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రత్నాకర్, సత్యసాయి, తాతబాబు, శరత్, సుబ్బరాజు, తిరుమలరావు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో పేదల భూములు సురక్షితం



దిష్టిబొమ్మకు విల్లు ఎక్కుపెడుతున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, న్యూస్‌టుడే: పేదల భూములు దోచుకునేందుకే జగన్ సర్కార్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చిందని, ఈ యాక్ట్ రద్దుతో ఆ భూములు సురక్షితంగా ఉంటాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం ఆలమూరు మండలం చొప్పెళ్ళలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో జగన్ సర్కార్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమంలోనూ చేపట్టిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసినందుకు నమూనాగా గ్రామస్థులు ఏర్పాటు చేసిన దిష్టి బొమ్మను ఆయన విల్లు ఎక్కుపెట్టి దహనం చేశారు. స్వచ్ఛతా కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. దంగేటి చంద్రకళ భాపనయ్య, మెర్ల సత్యవతి గోపాలస్వామి, నాగిరెడ్డి స్వామి, సూరపరెడ్డి సత్య, బల్ల హరికృష్ణ, మార్గాన సత్తిబాబు గౌడ్, జోంపోలు వెంకటరావు, జోంపోలు నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ ప్లాంట్ సమీపంలో మంటలతో ఆందోళన



ఓడలరేవులో విద్యుత్తు స్తంభం వద్ద..

అల్లవరం, న్యూస్‌టుడే: అల్లవరం మండలం ఓడలరేవులో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సంస్థ ఓఎన్జీసీ ప్లాంట్ సమీపంలో గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అధికారులు, స్థానికులు భయాందోళన చెందారు. స్థానికుల వివరాల మేరకు.. సముద్ర తీరానికి సమీపంలో ఉన్న ఓఎన్జీసీ ప్రహరీ పక్కనున్న విద్యుత్తు స్తంభం వద్ద తీగలు ఒకదానితో ఒకటి రాసుకుని నిప్పురవ్వలు ఎగిసి కిందనున్న చెత్తపై పడటంతో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు వ్యాపించాయని భావించారు. ఓఎన్జీసీ ప్లాంటుకు అత్యంత సమీపంలో ఉండటంతో అధికారులు కూడా కలవరపడ్డారు. తక్షణం సిబ్బంది అప్రమత్తమై విద్యుత్తు సరఫరాను నిలిపేసి మంటల్ని అదుపు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్తు స్తంభాలపై పిచ్చిమొక్కలు పెరుగుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్యాంకు కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలి మోసం

అంబాజీపేట, న్యూస్‌టుడే: బ్యాంకు కస్టమర్ (బీసీ) పాయింట్‌లో పని చేస్తున్న ఓ మహిళ మాయాజాలంతో డ్వాక్రా సంఘాల సభ్యులు పలువురు మోసపోయారు. ఆ మహిళ రూ.6.66 లక్షల మేర సభ్యుల సొమ్ము స్వాహా చేసినట్లు బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంటిగ్రా కంపెనీ అధికారులు దీనిపై పుల్లేటికుర్రు, కముజువారిలంక తదితర ప్రాంతాల్లో ఆరా తీస్తున్నారు. పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంకు పరిధిలో ఇంటిగ్రా అనే సంస్థ ద్వారా బ్యాంకు కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను నిర్వహిస్తున్నారు. దీని ద్వారా బ్యాంకు పరిధిలోని ఖాతాదారులు చెల్లింపులు, రుణాల లావాదేవీలు జరుపుతారు. అయితే పాయింట్ నిర్వహిస్తున్న పరమట మణి అనే మహిళ డ్వాక్రా సభ్యుల రుణాలకు సంబంధించిన నగదును గతేడాది నుంచి బ్యాంకుకు చెల్లించటంలేదు. ఇప్పటి వరకు సుమారు రూ.6.66 లక్షలు డ్వాక్రా సొమ్మును స్వాహా చేసినట్లు తెలుస్తోంది. బ్యాంకు పరిధిలోని తొమ్మిది డ్వాక్రాసంఘాలు ఉండగా నాలుగు సంఘాలవారు మోసపోయారంటూ బ్యాంకు మేనేజర్ సిద్ధార్థ తెలిపారు. తొమ్మిది సంఘాల వివరాలు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇంటిగ్రా సంస్థకు విషయం తెలిపామన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,500
పాతకాయ: గండేరా	18,000
గటగట	15,000
కొత్తకాయ: గండేరా	17,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	17,000-17,500
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	3,375
కిలో	225

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ఆలయాలకు పలువురి విరాళాలు

అయినవిల్లి: సిద్ధివినాయకస్వామివారి ఆలయంలో గురువారం అన్నదాన ట్రస్ట్‌కు చెన్నైకు చెందిన సాడ్రాస్‌ కుమార్‌వేల్‌ ఆనందవేల్‌ కుటుంబ సభ్యులు రూ.30,000.. కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన తవటపల్లి వెంకటేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు రూ10,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని బహూకరించారు.

వాడపల్లి(ఆత్రేయపురం): వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్న దాన భవన నిర్మాణానికి గురువారం జంగారెడ్డిగూడెంకు చెందిన కటారి చక్రవర్తి, రమ్యశ్రీ దంపతులు రూ.25,116 విరాళం అందించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం డీసీ చక్రధరరావు అభినందించారు.

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌.ఎస్‌.ఎస్‌ 1, 2 వారి సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్‌ సాయిబాబు ప్రారంభించారు. కళాశాలలో పరిశుభ్రత, ప్లాస్టిక్‌ నిషేధం వంటి అంశాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఉప ప్రిన్సిపల్‌ పద్మనాభం, నల్లి రాజు, సరిత, శైలజ, అశ్విని పాల్గొన్నారు.



రాజోలు డిగ్రీ కళాశాలలో ర్యాలీ

మత్స్యకారుల వల.. రొయ్యలతో కళ



సఖినేటిపల్లి: అంతర్వేది సముద్ర తీరంలో వరస అల్పపీడనాల ప్రభావంతో వేటకు వెళ్లలేక అల్లాడిపోతున్న మత్స్యకారులకు గురువారం రొయ్యలు, చేపలవేట కొంత ఊరట కలిగించింది. సముద్రం తెల్ల రొయ్యలు, టైగర్‌ రొయ్యలు, చేపపాములు, కోనాం చేపలు అధికంగా దొరికాయి. వీటిని మినీ హార్బర్‌లో రాశులుగా పోసి బహిరంగ వేలంపాట వేశారు. సుమారు రూ.6లక్షల వ్యాపారం జరిగిందని గంగపుత్రులు తెలిపారు. కొన్ని రోజుల నుంచి చేపలు లేక బోసిపోయిన మినీహార్బర్‌ మత్స్యరాశులతో ఒక్కసారిగా కళకళలాడింది.

సాగు రంగంలో ఆధునిక పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న జిల్లా ఏరువాక సమన్వయకర్త నందకిషోర్‌

అంబాజీపేట: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సాగు రంగంలో ఆధునిక పద్ధతులను పాటించాలని కోనసీమ జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఎం.నందకిషోర్‌, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎవీఎస్‌.రాజశేఖర్‌లు పేర్కొన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగలకుర్రులో రైతులకు గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతికి వ్యవసాయాధికారి డి.విజయకుమార్‌ అధ్యక్షత వహించారు. జడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, పి.గన్నవరం ఏడీఏ రామమోహనరావు, ఏఈవో డి.దుర్గారావు, రైతులు పితాని శ్రీనివాసరావు, యర్రంశెట్టి వీరభద్రరావు, వ్యవసాయ సహాయకులు ప్రియాంక, భీమరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

అన్నదాతలూ.. పొలం పిలుస్తోంది!

అంబాజీపేట, న్యూస్‌టుడే: రైతులకు క్షేత్రస్థాయిలో సాగు రంగంలో సాంకేతిక సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పొలం బాట పట్టారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా వివిధ శాఖల అధికారులు అన్నదాతల వద్దకే వెళ్లి పంటలపై అవగాహన కల్పించటంతో పాటు పొలాలను పరిశీలించి వారు చేపట్టవలసిన చర్యలను అప్పటికప్పుడే వివరిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో కార్యాలయాలకే పరిమితమైన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ‘ పొలం పిలుస్తోంది’ ద్వారా క్షేత్రస్థాయికి వస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్‌, సహకార, పశుసంవర్ధక, మత్స్య శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఆయా శాఖల ద్వారా అన్నదాతలకు అందిస్తున్న వివిధ పథకాలను రైతన్నలకు వివరించటంతో పాటు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. తగిన సలహాలు, సూచనలు అందించి కర్షకులను ప్రోత్సహిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..	
✦ మండలం	
● వరిపంట ఎకరాలు	
■ రైతులు	
✦ అంబాజీపేట	
● 3,500	
■ 10,219	
✦ అయినవిల్లి	
● 8,886	
■ 17,506	
✦ పి.గన్నవరం	
● 7,200	
■ 12,180	
✦ మామిడికుదురు	
● 4,300	
■ 10,500	


పసుపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి విజయకుమార్‌

లాభసాటిగా మార్చేందుకు..

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సాగు రంగాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దీనిలో భాగంగా ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పొలం బాట పట్టాలి. పంటల సాగుపై చర్చలు జరపాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ, సాంకేతిక సమాచారం పరిజ్ఞానం చేరువచేయడం, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడం, క్షేత్ర సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించడం, తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికరాదాయం దిశగా ‘పొలం పిలుస్తోంది’ని ఏర్పాటు చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నారు..



ఈ కార్యక్రమంలో పంటలకు సోకే తెగుళ్లు, పురుగులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి వారం వ్యవసాయానికి సంబంధించిన అధికారులు పొలం వద్దకు రావడంతో పంటల చీడపీడలను స్వయంగా చూసే అవకాశం ఉంది. వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు వారు అందిస్తున్న పథకాలపై అవగాహన ఏర్పరుచుకుని సద్వినియోగం చేసుకోవచ్చు.

- పులిమే వెంకటేశ్వరరావు, రైతు, పసుపల్లి

రైతులకు మేలు..



పంటపొలాల్లోకి అధికారులు రావడం రైతులకు ఆనందమే. గత ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో తిరిగి రైతుల కోసం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమం కర్షకులకు మేలు చేసేలా ఉంది. దీనిని రైతులందరూ సద్వినియోగం చేసుకుంటున్నాం.

- వక్కపట్ల సత్తిరాజు, రైతు, పసుపల్లి

విద్యుత్తు సరఫరా నిలుపుదల

అంబాజీపేట: ముక్కామల విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాను ఉండదని అమలాపురం విద్యుత్తుశాఖ ఏఈ రవికుమార్‌ తెలిపారు. మోడేకుర్రు, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ముక్కామల, ఇరుసుమండ, వక్కలంక, కెవి.లంక, శ్రీరామ్‌పురం, వానపల్లి, పసుపల్లి, కొత్తపేట మండలం గొలకోటివారిపాలెంలో సరఫరా ఉండదన్నారు.

★ **అయినవిల్లి:** మండలంలోని 33కేవీ విద్యుత్తు లైను పరిధిలో శుక్రవారం మరమ్మతుల కారణంగా విద్యుత్తు ఉండదని ఏఈ శ్రీనివాసు తెలిపారు. అన్ని గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

అంబాజీపేట: విద్యార్థులకు పాఠశాల, కళాశాల స్థాయి నుంచే వినియోగదారుల చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన ఉండాలని కోనసీమ వినియోగదారుల సమాఖ్య ఛైర్మన్‌ అరిగెల బలరామమూర్తి, డైరెక్టర్‌ రవణం రాము పేర్కొన్నారు. అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం. సాయిరాం, ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, ఆనందకుమార్‌, బేగం పాల్గొన్నారు.


కొత్తపేట: గంటిలో సీమంతాల కార్యక్రమంలో గర్భిణులు


మలికిపురం మండల పరిషత్తు కార్యాలయంలో..

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కొత్తపేట, న్యూస్‌టుడే: గర్భిణులు, చిన్నారులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సర్పంచి సాగి బంగార్రాజు అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం గంటి గ్రామంలో ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. సూపర్‌వైజర్‌ చంద్రకళ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు, గుత్తుల బుల్లియ్య, మట్టపర్తి భూలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ వరలక్ష్మి, ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం, న్యూస్‌టుడే: పోషకాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం బాగుంటుందని ఐసీడీఎస్‌ సీడీపీవో కె.రమాదేవి, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి అన్నారు. ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పిశెట్టి సీతామహలక్ష్మి, మాజీ సర్పంచి కాకి లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సేవా సంస్థ ఆర్థిక సాయం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.కార్తీక్‌ రెండు కిడ్నీలు పాడైపోవడంతో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కళాశాలలోని శ్రీ ఫ్రెండ్స్‌ సేవా సంస్థ సమకూర్చిన రూ.15వేల నగదును కుటుంబ సభ్యులకు గురువారం అందించారు. సంస్థ సభ్యులను ప్రిన్సిపల్‌ శ్రీనివాస్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ అధికారి అరుణ్‌కుమార్‌ అభినందించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

రావులపాలెం పట్టణం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్‌ మల్లం పర్వతవర్ధనరావు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టార్‌ ఆఫ్‌ పోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్‌ శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్‌ అధికారి అరుణ్‌కుమార్‌, సుభాషిని, సత్యమూర్తి, రమేష్‌, సుమలత, ప్రసాద్‌, యువరాజ్‌ పాల్గొన్నారు.

కూరగాయల ధరలను నియంత్రించాలి

మలికిపురం: కూరగాయల ధరలను నియంత్రించాలని సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్‌ ప్రభుత్వాన్ని కోరారు. దిండిలో గురువారం సీపీఐ రాజోలు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరలు పెరగడంతో కూరగాయలు కొనలేకపోతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

నిధులు చాలక.. నిరుపయోగంగా!


ఆత్రేయపురం అంగన్‌వాడీ భవనం పరిస్థితి..

ఆత్రేయపురంలో తొమ్మిదేళ్ల కిందట రూ.8 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రమిది. నిధులు సరిపోక అప్పటి నుంచి ఇలా గుమ్మాలు, కిటికీలు వంటి ఏర్పాటు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. మిగిలిన పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం కేంద్రం పరాయి పంచన అరకొర వసతులతో నడుస్తోంది. దీంతో సిబ్బందితో పాటు బాలలు, బాలింతలు, గర్భిణులు పలు ఇబ్బందులు పడుతున్నారు. భవనం పనులు పూర్తిచేసేందుకు అదిగో ఇదిగో అనడం తప్పించి, ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గ్రామస్థులు ఈ భవన నిర్మాణం గురించి గ్రామాల్లో జరిగే సమావేశాల్లో ప్రస్తావించినా మోక్షం కలగడంలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషిచేస్తామని ఐసీడీఎస్‌ పర్యవేక్షణాధికారి కుమారి ఈసందర్భంగా తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ప్రహరీ నిర్మాణ పనులు నిలుపుదల


ప్రహరీని పరిశీలిస్తున్న తహసీల్దార్‌ మృత్యుంజయరావు

రాజోలు: రాజోలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పోస్టాఫీసు ప్రహరీ గోడ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారని స్థానిక నాయకులు, గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌ఛార్జి తహసీల్దార్‌ మృత్యుంజయరావు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ప్రహరీ కింద తాగునీటి గొట్టాలు ఉన్నాయని, డ్రైన్‌ నిర్మాణానికి విగాతం కలుగుతుందని గ్రామస్థులు వాపోయారు. సమస్యను వారు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ దృష్టికి తీసుకుని వెళ్లగా స్థలాన్ని సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో సర్వే అయ్యేవరకు పనులు నిలపాలని మృత్యుంజయరావు అధికారులతో అన్నారు. డీటీ శ్రీనివాస్‌, కూటమి నాయకులు పాల్గొన్నారు.


రైతులకు అండగా కూటమి ప్రభుత్వం


ధ్రువీకరణపత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, అంబాజీపేట: అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రైతుల సంక్షేమం కోసం ఆలోచనలు చేస్తున్నారన్నారు. ముంగండలోని లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో డొక్కా సీతమ్మ ఫెడ్‌ ఫార్మర్స్‌ ప్రొడ్యూసర్‌ సంస్థ తొలి వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం ఆ సంస్థ అధ్యక్షుడు ఆరుమిల్లి లాబ్‌బాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం రైతుల ధాన్యం బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.1000 కోట్ల ధాన్యం బకాయిలను విడుదల చేసిందన్నారు. కోనసీమలో మొదట ఏర్పాటు చేసిన కృషీవల కోకోనట్‌ ఫార్మర్స్‌ ప్రొడ్యూసర్‌ సంస్థ విజయవంతంగా నడుస్తోందన్నారు. డొక్కా సీతమ్మ ఫెడ్‌ ఫార్మర్స్‌ ప్రొడ్యూసర్‌ సంస్థ కూడా ఆదే విధంగా ముందుకు దూసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యే ఈ సంస్థలో రూ.2 వేలు చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. రైతులకు ధ్రువీకరణపత్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. భారతీయ కిసాన్‌ సంఘ్‌ అఖిలభారత కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కృషీవల సంస్థ ఛైర్మన్‌ గణపతి వీరరాఘవులు, ఫార్మర్స్‌ ప్రొడ్యూసర్‌ సంస్థ ఛైర్మన్‌ వేగి వెంకటేశ్వరరావు, భారతీయ కిసాన్‌ సంఘ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల జమ్మీలు, జనసేననేత వాసంశెట్టి కుమార్‌, డొక్కా సీతమ్మ సంస్థ సీఈవో డి.రామ్మోహన్‌, సభ్యులు, ఉద్యానశాఖాధికారి దిలీప్‌కుమార్‌, ఉద్యానశాస్త్రవేత్త ఎ.కిరీటి, అడ్డాల గోపాలకృష్ణ, చెరుకూరి గోపాలకృష్ణ, పేరాబత్తుల రామకృష్ణ పాల్గొన్నారు. పి.గన్నవరం మండలంలోని పోతవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలోనూ ఆయన మాట్లాడారు.

‘తిరుమలలో నెయ్యితో పాటు అన్నీ నాసిరకమే’

మామిడికుదురు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో తిరుమల లడ్డూలో నెయ్యితో పాటు అన్ని సరకులు నాసిరకాలే వాడినట్లు విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ దర్యాప్తులో స్పష్టం కావడాన్ని ప్రజలంతా గమనించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ చేపట్టిన దీక్షకు సంఘీభావంగా గోగన్నమఠంలోని వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం ప్రాంగణంలో గురువారం ప్రాయశ్చిత్త దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు భూపతి రాజు ఈశ్వరరాజువర్మ, సర్పంచి అల్లు విజయ లక్ష్మి, మార్క్‌ఫెడ్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ గుండుబోగుల పెద్దకాపు, తితిదే మాజీ సభ్యుడు పద్మరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు సాగి బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ప్రాయశ్చిత్త దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

సఖినేటిపల్లి: అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మెల్యే దేవ సర్వసభ్య సమావేశంలో అన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ధవళేశ్వరం నుంచి సఖినేటిపల్లి వరకు పైపులైన్‌ కోసం రూ.1650కోట్లు మంజూరైతే ఆ నిధులతో పనులు కూడా చేయలేకపోయిందని, ఆ నిధులు రాబట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. సమన్వయకర్త పెదకాపు, ఎంపీపీ మల్లిబాబు, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్‌ భాస్కర్‌, జడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ అధికారులు పాల్గొన్నారు.

మలికిపురం: ‘మాకు పాఠాలు చెప్పించండి మహా ప్రభో’ అంటూ మలికిపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎమ్మెల్యే వరప్రసాద్‌కు మొరపెట్టుకున్నారు. జీతాల కోసం 16 రోజులుగా స్థానిక ఎమ్వీఎన్‌ జేఎస్‌ అండ్‌ ఆర్వీఆర్‌ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రిలే నిరాహార దీక్షలు, ఆందోళన చేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఖాళీగానే కూర్చోవాల్సి వస్తోందని వాపోయారు. ప్రిన్సిపల్‌ తోరం సతీశ్‌తో తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

శివయ్యకు బండారు మొక్కులు


తులాభారంలో ఎమ్మెల్యే బండారు, చిత్రంలో జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్‌ తదితరులు

ఆలమూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు కూటమి నాయకులు గురువారం ఆలమూరు మండలం చొప్పెల్ల శివాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు పటికబెల్లంతో తులాభారం నిర్వహించారు. 108 కొబ్బరికాయలు సైతం కొట్టి మొక్కు చెల్లించినట్లు తెదేపా నాయకులు సుంకర శంకరయ్య తెలిపారు. జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్‌, మెర్ల గోపాలం, సూరనీడి సత్య, బల్ల హరికృష్ణ, సాకుముల రాముడు, సుంకర సోమన్న పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఆత్రేయపురం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం మండలంలోని మెర్లపాలెం గ్రామానికి చెందిన మెర్ల చంద్రావతికి వైద్యసేవలు నిమిత్తం సీఎం సహాయ నిధి కింద నియోజకవర్గంలో మొదటగా మంజూరైన రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచి మెర్ల రాము, నాయకులు పాల్గొన్నారు.

రాజోలు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తాటిపాక వేద విద్యాసంస్థల కరస్పాండెంట్‌ ఎవివిఎస్‌.రవికుమార్‌ రూ.50 వేల విరాళాన్ని నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు అమరావతిలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన్ను అభినందించారు.

అక్రమ బాణసంచా సీజ్‌

ఆత్రేయపురం: మండలంలోని రెండు గ్రామాల్లో అక్రమంగా బాణసంచా తయారు చేసి నిల్వ ఉంచిన ఇరువురు నిందితులపై ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాము వివరాలు ప్రకారం నార్కెడుమిల్లి, తాడిపూడి గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా బాణ సంచా తయారు చేస్తూ నిల్వ ఉంచిన మందు గుండు సామగ్రితో పాటు ఇందుకు వాడే ముడి సరుకు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు.

సైబర్‌ నేరస్థుల వలలో పడొద్దు

రావులపాలెం పట్టణం: రైతులు, వ్యాపారస్థులు అప్రమత్తంగా ఉండి సైబర్‌ నేరస్థుల వలలో పడొద్దని యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా జోనల్‌ మేనేజర్‌ షాలినీ మీనన్‌ అన్నారు. రావులపాలెంలోని వెదిరేశ్వరం రోడ్డులో నూతన బ్యాంకును గురువారం ప్రారంభించారు. డిజిటల్‌ బ్యాంకింగ్‌ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు పుల్లేటికుర్రు విద్యార్థులు

అంబాజీపేట: రాష్ట్రస్థాయి బాల్‌ బాడ్మింటన్‌ పోటీలకు పుల్లేటికుర్రు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం.కె.సూర్యకనకదుర్గ, పీడీ అందే సూర్యనారాయణ తెలిపారు. స్కూలు గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 24న మండపేట ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో నిర్వహించిన అండర్‌-19 విభాగంలో లక్కింశెట్టి విజయసాయి లక్ష్మి, రోళ్ల సంగీత కీర్తిలు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

జిల్లా అథ్లెటిక్స్‌ పోటీలకు..

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం జడ్పీ పాఠశాల విద్యార్థులు జిల్లా అండర్‌ 14, 17 అథ్లెటిక్స్‌లో జరిగే పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సతీష్‌ తెలిపారు. గురువారం పొన్నమండ జడ్పీ పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి అండర్‌ 14, 17 బాలబాలికల విభాగాల్లో షాట్‌పుట్‌, లాంగ్‌జంప్‌, ట్రిపుల్‌జంప్‌, డిస్కత్రో, 1500మీటర్స్‌, 800మీటర్స్‌ 600మీటర్స్‌లలో విజయం సాధించారన్నారు.

ఆలమూరు: ఊబలంకలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా క్రీడల్లో చెముడులంక శ్రీసత్యావిద్యానికేతన్‌ విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్‌ విజయ్‌కుమార్‌ తెలిపారు.

కొత్తపేట ఆర్డీవోగా శ్రీకర్‌

కొత్తపేట: సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తపేట ఆర్‌డీఓగా డిప్యూటీ కలెక్టర్‌ పి.శ్రీకర్‌ను నియమిస్తునట్లు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎంపీపీ పరామర్శ

రాజోలు: ములికిపల్లిలోని తెదేపా గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు వేగిరాజు అబ్బాయిరాజు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ స్పీకర్‌ ఎ.వి.సూర్యనారాయణరాజు, ఎంపీపీ కేతా శ్రీనివాస్‌ గురువారం పరామర్శించారు.

చిన్నారుల చేయూత



ముఖ్యమంత్రి సహాయనిధికి సాయం అందిస్తున్న చిన్నారులు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: వరద బాధితుల కోసం చిన్నారులు సైతం తమవంతు చేయూతనందించేందుకు ముందుకు వచ్చారు. రావులపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన చిన్నారులు విజయవాడలో బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి అందించేందుకు తాము దాచుకున్న డబ్బులను విరాళంగా ఉపాధ్యాయులకు గురువారం అందించారు. ఆ సొమ్ము మొత్తం రూ.25వేలు రాగా వారిని అభినందిస్తూ ఎంఈవోలు నాగకుమార్‌, శ్రీనివాసరాజులు రూ.1000లు సాయంగా ఉపాధ్యాయులకు అందించారు.

వ్యాసరచన పోటీలు

కొత్తపేట: రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలను స్థానిక విశ్వకవివేమన డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. శ్రీ సత్యసాయి విద్యా విభాగం, ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు పోటీపడగా.. కళాశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు హాజరవుతారని కళాశాల ప్రిన్సిపల్‌ రాజు తెలియజేసారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబాజీపేట: సత్యసాయి సేవా సంస్థలు ఉన్నతపాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు అంబాజీపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ‘భగవంతుడే నా స్నేహితుడు’ అంశంపై పోటీలను నిర్వహించారు.

విష్ణు సహస్రనామ పారాయణం

అంబాజీపేట, న్యూస్‌టుడే: మానవాళీ ముక్తిని పొందేందుకు విష్ణు సహస్రనామ పారాయణమే శరణ్యమని గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన కాళీవన ఆశ్రమ ప్రవచన కర్త శ్రీనివాసరామానుజ దాసు అన్నారు. అంబాజీపేటలో జరుగుతున్న శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వాహకులు అప్పన రవి, రేవతి దంపతుల ఇంటి వద్ద ఈ విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు.

గుంతల దారిలో ‘నడక’యాతన


కొమరాడ- మగటపల్లి రహదారి దుస్థితి

మామిడికుదురు నుంచి కొమరాడ, మగటపల్లి మీదుగా గోగన్నమఠం వరకు 7.66 కిలోమీటర్ల మేర ఉన్న ర.భ శాఖ పరిధిలోని ప్రధాన రహదారి పెద్దపెద్ద గుంతలు పడి దుర్భరంగా మారింది. పంట కాలువ వైపు పలు చోట్ల కుంగిపోవడంతో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని ఏడు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర యాతనలు పడుతున్నారు. దాదాపు ఏడెనిమిదేళ్లుగా దీనికి మరమ్మతులు లేకపోవడంతో అవస్థలు అంతకంతకూ తీవ్రమవుతున్నాయి. దీనికి రూ.2.1 కోట్లు మంజూరైనా ఎన్నికల ప్రకటనకు ముందు హడావుడిగా అక్కడక్కడా రోడ్డును తవ్వేసి నిధులు రాకపోవడంతో అలానే విడిచిపెట్టేశారు. నగరం 216 జాతీయ రహదారి నుంచి పెదపట్నం వరకు 2.38 కిలోమీటర్ల రోడ్డు పరిస్థితి కూడా ఇంతే. ఈ రహదారిపై రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర యాతనలు పడుతున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే మామిడికుదురు-గోగన్నమఠం రహదారి పనులు చేపడతామని సంబంధిత ఏఈఈ సురేష్‌ తెలిపారు. పెదపట్నం రోడ్డుకు రూ.20 లక్షలు మంజూరైందని, అది టెండరుకు సిద్ధమవుతోందన్నారు.

– న్యూస్‌టుడే, మామిడికుదురు

వేంకటేశ్వరాలయంలో ప్రాయశ్చిత్త పూజలు


పళ్లవారిపాలెంలో పూజలు చేస్తున్న నాయకులు

ముమ్మిడివరం: తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం తయారీలో జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా పళ్లవారిపాలెంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో తెదేపా, భాజపా నాయకులు గురువారం పూజలు నిర్వహించారు. వీర మహిళలు వృద్ధగౌతమి గోదావరి నుంచి జలాలు తీసుకొచ్చి పళ్లవారిపాలెంలోని పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించారు. స్వామినాయుడు, జమ్మి పురుషోత్తం, బాబూరావు, రమ, బాలరాజు, రాజబాబు, గణేష్, శ్రీనివాసరావు, శ్రీధర్, సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

రేపు గరికపాటి ప్రవచనం

అమలాపురం పట్టణం: పద్మశ్రీ గరికపాటి నరసింహారావు శనివారం జిల్లాకేంద్రమైన అమలాపురం పట్టణంలో ప్రవచనం చేస్తారని ఆదాని ధార్మిక సంస్థల నిర్వాహకులు అయ్యల సోమయాజుల బ్రహ్మానందం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కె.అగ్రహారం జానకీరామ మందిరంలో 28న సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే కార్యక్రమానికి హిందూ ధార్మిక బంధువులు తరలిరావాలని కోరారు.

రెవెన్యూ అధికారిగా శ్రీలక్ష్మి

అమలాపురం పట్టణం: అమలాపురంలోని పురపాలక సంఘ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా బి.శ్రీలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం పూర్తిస్థాయిలో విధుల్లో చేరారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మున్సిపల్ మేనేజర్‌గా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. 2022లో పది నెలలు ఇక్కడే పని చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: భూపయ్య అగ్రహారంలో వర్షాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారైంది. వీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి. - తేజ, వ్యాపారి

సమస్య: అమలాపురంలోని మెట్లకాలనీలో రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. విషపురుగులు సంచరిస్తున్నాయి. - రమేష్, వ్యాపారి

సమస్య: అమలాపురంలోని శ్రీరామపురం కాలువపై నిర్మాణ వ్యర్థాలు పడిపోవడంతో మురుగు ముందుకు కదలక ఇబ్బందులు వస్తున్నాయి. - సుబ్రహ్మణ్యం, స్థానికుడు

సమస్య: అమలాపురంలోని అశోక్‌నగర్ రోడ్డుపై మట్టి, వ్యర్థాలు పేరుకుపోవడంతో అటుగా వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. - శ్రీధర్, వాహనదారు

పరిష్కారం: అమలాపురంలోని భూపయ్య అగ్రహారం, మెట్లకాలనీ, శ్రీరామపురం, అశోక్‌నగర్‌లలో సమస్యలు తెలుపగా ఆయా వార్డుల సచివాలయ కార్యదర్శులు స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు.

సమస్య: కాట్రేనికోన పరిధిలో రోడ్డును ఆనుకుని చెత్త పేరుకుపోయింది. అధికారులు స్పందించి తొలగింపు పనులు చేపట్టాలి. - రాజు, స్థానికుడు

పరిష్కారం: సమస్యను సర్పంచి సుధీర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో రోడ్డుపక్కన చెత్తను తొలగించారు.

సమస్య: చెయ్యేరు పంచాయతీ కార్యాలయ పరిసరాల్లో కొన్ని చోట్ల వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. పంచాయతీ అధికారులు వాటి మరమ్మతులు చేపట్టాలి. - గ్రామస్థుడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ సర్పంచి చెల్లి సురేష్‌కి తెలుపగా స్పందించారు. సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

సమస్య: మార్కెట్ ప్రాంతంలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకు సాగక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి. - జి.సత్యనారాయణ, స్థానికుడు

సమస్య: బస్టాండు ప్రాంతంలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించడానికి చర్యలు తీసుకోవాలి. - ఎస్.మహేశ్వరరావు, స్థానికుడు

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్, బస్టాండు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన, అమలాపురం పట్టణం, ముమ్మిడివరం

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: **79811 19595**, ముమ్మిడివరం: **80085 74166**


తళ్లావారివీధికి వెళ్లే రోడ్డు..


డిగ్రీ కళాశాల మార్గం అధ్వానం


అబ్బిరెడ్డివారి వీధికి వెళ్లే దారి

ప్రథమశ్రేణి పురపాలిక దారులివీ..

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

గమ్యం చేరాలంటే దారులు భయపెడుతున్నాయి. అడుగడుగునా గోతులే ఆహ్వానం పలుకుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం స్థానికులు, వాహనదారులు, ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో భూపయ్య అగ్రహారం, అబ్బిరెడ్డివారి వీధి, కుమ్మర్లవీధి రహదారులు గుంతలమయంగా మారాయి. గత ప్రభుత్వంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' ద్వారా రూ.45 కోట్లతో ఈ రహదారి నిర్మిస్తామని ప్రకటించినా.. మాటలకే పరిమితమైంది. జాతీయ రహదారికి కలిసే ప్రధాన రహదారి ఇలాఉండటం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో రెండు కళాశాలలు, ఆలయాలు, ఆసుపత్రులు, దుకాణాలు, ఎక్కువగా అపార్టుమెంట్లు ఉంటాయి. ఈ రోడ్డులో పేద, మధ్య తరగతి, ఉన్నత వర్గాల వారు అధిక సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ రుద్రరాజు నాని రాజు, మరో వైకాపా కౌన్సిలర్ ఉన్నా.. ఈ రోడ్డును నిర్మించలేకపోయారు.

- **కాలనీలు:** రెడ్‌ఫోర్ట్, మాధవ్‌నగర్, అబ్బిరెడ్డివారివీధి, తళ్లావారివీధి, వంకాయలవారివీధి, శ్రీరామ్‌నగర్, ఏఎస్ఎన్‌కాలేజీరోడ్డు, గోపాలకృష్ణవీధి, కుమ్మర్లవీధి
- **నివాసిత గృహాలు:** సుమారు **2** వేలు
- **రహదారికి మరమ్మతులు:** గతంలో రూ.**8** లక్షలతో
- **వాస్తవంగా అవసరం:** రూ.**1** కోటి

అంతా గోతులమయం..

అగ్రహారానికి వెళ్లే సాయిబాబా ఆలయం వద్దనుంచి కురసాలవారివీధి రోడ్డు వరకు, కొంకాపల్లి అబ్బిరెడ్డివారి వీధి నుంచి కుమ్మర్లవీధి చివరి వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. కురిసిన చిన్నపాటి వర్షానికి గుంతలెక్కడున్నాయో తెలియక వాహనదారులు, నడిచేవారు అవస్థలు పడుతున్నారు. కాలేజీ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఉండే ఈ రోడ్డును ఎంతో మంది ప్రయాణికులు ఉపయోగిస్తారు. విశాలంగా ఉండే రోడ్డును ప్రథమ శ్రేణి పురపాలికలో కొందరి రాజకీయాల కారణంగా నిర్మించలేదు. అమలాపురంలో ట్రాఫిక్ సమస్యలు తిష్టవేయడంతో ఈ రోడ్డును కూడా వాడేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నమ్మాం.. మోసపోయాం

మేం 2019 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వైకాపాకు ఓటు వేశాం. రోడ్డు గుంతలమయంగా మారిందని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. 'గడపగడపకు మన ప్రభుత్వం' ద్వారా రహదారి నిర్మిస్తామని గొప్పలు చెప్పారు. అయిదేళ్లు గడిచినా దారి గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో రోడ్లు వేయాలని కోరుతున్నాం.
- నాయుడు, స్థానికుడు

రోడ్డు నిర్మాణం చేస్తాం

గతంలో రహదారి నిర్మాణానికి ఆదేశాలున్నా.. నిధులు రాకపోవడంతో నిర్మించలేదు. కౌన్సిల్ సమావేశంలో నిధులు మంజూరైతే రోడ్డు నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - కేవీఆర్ఆర్ రాజు,
అమలాపురం మున్సిపల్ కమిషనర్

బ్రహ్మోత్సవాలకు రాట ముహూర్తం


పూజ చేస్తున్న పరిపాలనాధికారి మునిస్వామి

యానాం: యానాం ప్రజల ఆరాధ్య దైవమైన మీసాల వెంకన్న ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు గురువారం ఉదయం పరిపాలనాధికారి మునిస్వామి రాట ముహూర్తం చేశారు. అంతకుముందు శ్రీవారి బాలాలయంలో ఉత్సవ నిర్వాహకులు, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. అక్టోబరు 4 నుంచి 13వ తేదీ వరకు శ్రీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలను శ్రీవారి బాలాలయం వద్ద నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నాగభట్ల బుజ్జి, పెద్దింటి లక్ష్మణాచార్యులు, శేరు కృష్ణ, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీకి రూ.10 వేల జరిమానా

యానాం: కనకాలపేట పుష్కర స్నాన ఘట్టం వద్ద అక్రమంగా ఇసుకను లారీలో వేరే ప్రాంతానికి తరలిస్తున్న డ్రైవరు నంది కోళ్ల పురుషోత్తంను బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు యానాం ఎస్సై మురుగానందన్ తెలిపారు. ఆరు యూనిట్ల టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న యజమాని కవల శ్రీనివాసుకు డీటీ దండాయుధపాణి రూ.10 వేల జరిమానా విధించారని, ఇసుకను ప్రజా పనులశాఖకు అప్పగించామని తెలిపారు.

ఉద్యోగాలు కల్పించాలని నిరసన

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో పనిచేసిన వాలంటీర్లకు ఈ ప్రభుత్వంలో ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు కోరారు. అమలాపురంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మాజీ వాలంటీర్లు మున్సిపల్ కమిషనర్ రాజుకు బుధవారం విన్నవించారు. అనంతరం భరతమాత విగ్రహం వద్ద వినతిపత్రం పెట్టి, తమకు మూడు నెలలుగా జీతాలు రావడంలేదని మొరపెట్టుకున్నారు.

'వైకాపా పాలనలో రాష్ట్రం అధోగతి'


వన్నెచింతలపూడిలో స్టిక్కరు అతికిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఎమ్మెల్యే ఆనందరావు ఆరోపించారు. వన్నెచింతలపూడిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని సర్పంచి నాగవాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. గత ప్రభుత్వంలో జీతాలందక ఉద్యోగులు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు. అనంతరం తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి ఇంటింటా స్టిక్కర్లు అతికించి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు ఈశ్వరరావు, మహాలక్ష్మీ ప్రభాకరరావు, వాసు రాజు, ధర్మపాల్, సత్యవరప్రసాద్, రాము, కృష్ణ, ఉదయ్ బాబు, గెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న తీగలు..



చినకొత్తలంక రోడ్డులో విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకుపోయాయి. తీగలు కలిసి ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి గురించి ఆ శాఖ ఏఈ యేసురాజు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి తీగలు తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ముమ్మిడివరం


లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి

హుషారుగా ముగిసిన ఆటల పోటీలు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. ఖోఖో, వాలీబాల్, యోగా, లాంగ్‌జంప్ తదితర అంశాల్లో అండర్ 14, 17 విభాగాల్లో పోటీలు జరిగాయి. ఎంపికైన విద్యార్థులు కాకినాడలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీలు కామన మధు, గొలకోటి ఫణి, విఘ్నేశ్వరావు, గణేశ్వరరావు తదితరులు తెలిపారు.

సామూహిక సీమంతాలు

అమలాపురం గ్రామీణం: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఈదరపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు గురువారం నిర్వహించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా పౌష్టికాహార ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో కుమారి, ఏవో కుమారి, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణ, శ్రీనుబాబు, ఆజంనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


చక్రధరరావు చిత్రపటం వద్ద సుబ్బరాజు

కాట్రేనికోన, ఐ.పోలవరం: కాట్రేనికోనలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచి మోకా చక్రధరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా తెదేపా నాయకుడైన చక్రధరరావు కుమారుడు అప్పాజీతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ✦ పితృ వియోగంతో బాధపడుతున్న తెదేపా సీనియర్ నేత కడియం వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే బుచ్చిబాబు గురువారం పరామర్శించారు. స్వామినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అక్రమ మద్యం పట్టివేత

ముమ్మిడివరం: యానాం నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ముమ్మిడివరం పోలీసులు గురువారం పట్టుకున్నారు. అల్లవరానికి చెందిన గుండుపల్లి వీరబాబు ఆటోలో యానాం నుంచి 150(నిబ్‌లు) మద్యం సీసాలు, మూడు ఫుల్ బాటిళ్లు, నాలుగు బీరు సీసాలు తరలిస్తుండగా కొండాలమ్మచింత వద్ద పోలీసులు వాహనాల తనిఖీల్లో గుర్తించి పట్టుకున్నారు. ఆటో, మద్యం సీసాలు సీజ్ చేసి వీరబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు.

విద్యార్థులూ.. చట్టాలు తెలుసుకోండి

కాట్రేనికోన: చట్టాలపై విద్యార్థులకు కనీస అవగాహన అవసరమని కాట్రేనికోన ఎస్సై అవినాష్ పేర్కొన్నారు. కాట్రేనికోన జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన వివిధ చట్టాలను వివరించారు. సమాజంలో మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలు, గంజాయి, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలు, బాలలపై లైంగిక వేధింపులు, బాలికల భద్రత, సైబర్ నేరాల గురించి చెప్పారు. బాలికలను ఎవరైనా ఏడిపించినా, ఇబ్బంది పెట్టినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాజంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఏం జరిగినా పోలీసులకు ధైర్యంగా తెలియజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఉపాధ్యాయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్సై అవినాష్

'లడ్డూ అపవిత్రతకు పాల్పడినవారిని శిక్షించాలి'


బెండమూర్లంకలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

యానాం: తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీలో జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యిని ఉపయోగించి అపవిత్రం చేసి, హిందువులను కించపరిచేలా వ్యవహరించిన దోషులను కఠినంగా శిక్షించాలని యానాం విశ్వహిందు పరిషత్ సభ్యులు గురువారం ఆందోళన చేశారు. శ్రీవారి ప్రసాదమైన లడ్డూకు జరిగిన అపవిత్రాన్ని ఖండిస్తున్నామని ఈ సందర్భంగా పలువురు వక్తలు పేర్కొన్నారు. మీసాల వెంకన్న ఆలయం నుంచి ఆరెస్సెస్, వీహెచ్‌పీ, బజరంగదళ్ ప్రతినిధుల నిరసన ప్రదర్శన నినాదాలతో పురవీధుల్లో సాగింది. పరిపాలనాధికారి మునిస్వామికి ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు లకుమన సుబ్బారావు, తుపాకుల ప్రసాదరావు, నాగాభట్ల బుజ్జి, రామారావు, భాస్కర్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

అల్లవరం: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని బెండమూర్లంక గ్రామస్థులు కోరారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భాస్కరరావు, ఈశ్వరరావు, గుర్రం రామకృష్ణ, సురేష్, శ్రీలక్ష్మి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కార్యకర్తలు

కాట్రేనికోన: నామినేటెడ్ పదవుల్లో రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడిగా మండలానికి చెందిన నాగిడి నాగేశ్వరరావును ఎంపిక చేశారు. గతంలో మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్‌తోపాటు ఎన్నో పదవులు చేపట్టిన సీనియర్ నాయకుడు నాగిడిని డైరెక్టరుగా నియమించారని రెండు రోజులుగా నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. సుమారు 400 మందికిపైనే కార్యకర్తలు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి ఈ విషయం తెలియజేశారు. రాష్ట్రస్థాయి పదవి చేపట్టిన ఆయనకు గతంలో చేపట్టిన మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ వంటిది ఇప్పించేలా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి మరింత ఉన్నత పదవి వచ్చేలా కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారని కార్యకర్తలు తెలిపారు.

కోర్టు ప్రాంగణంలో వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి రహంతుల్లా

ముమ్మిడివరం: ముమ్మిడివరంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాలు వద్ద అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాన్ని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా ప్రారంభించారు. శిబిరంలో అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు రక్త పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, కంటి, గుండె సంబంధిత పరీక్షలు చేశారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు వెరసి 50 మందికి పరీక్షలు చేశారు.

జేఈ పోస్టులకు వచ్చేనెల 27న రాత పరీక్ష


యానాం: పుదుచ్చేరి ప్రజాపనుల శాఖలో జూనియర్ ఇంజినీర్, ఓవర్‌సీర్ పోస్టుల భర్తీకి అక్టోబరు 27న పుదుచ్చేరిలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు పాలనా సంస్కరణల విభాగం అండర్ సెక్రటరీ వి.జైశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. దరఖాస్తుదారుల హాల్‌టికెట్లు ఎప్పుడు విడుదల చేసేదీ త్వరలో తెలియజేస్తామని, ఇతర వివరాలకు ttp://ecruitment.py.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని జైశంకర్ తెలిపారు.


పల్లంకుర్రులో కరపత్రం ఇస్తున్న నాయకులు

ఇది మంచి ప్రభుత్వం

కాట్రేనికోన: పల్లంకుర్రు, మొక్కలతిప్ప, కాట్రేనికోన, నడవపల్లి తదితర గ్రామాల్లో నాయకులు గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు, అధికారులు ఇంటింటికీ తిరిగి 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పనులను వివరించి కరపత్రాలు అందించారు. వి.సుధీర్, జి.సత్తిబాబు, పీటీ వర్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వారం.. అంధకారం


యానాంవైపు లైట్లు వెలగక చీకటిగా ఉన్న ప్రవేశద్వారం


కనకాలపేటవైపు కాంతులీనుతున్న జవహర్‌లాల్ నెహ్రూ గేట్

యానాం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-216 మీదుగా యానాం వచ్చే ప్రయాణికులకు స్వాగతం పలికేందుకు యూకేవీనగర్, భీంనగర్ కూడళ్ల వద్ద ఎంతో సుందరంగా నిర్మించిన ముఖద్వారం దగ్గర విద్యుత్తు దీపాలు వెలగక అంధకారం రాజ్యమేలుతోంది. పర్యాటక కేంద్రమైన యానాం వచ్చేవారికి, కనకాలపేట గ్రామంవైపు వెళ్లేవారిని ఆకట్టుకునేలా ఇందిరా గాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూల భారీ విగ్రహాలను ఇక్కడ నిర్మించారు. ఏటిగట్టు మీదుగా యానాం వెళ్లి వచ్చేవారు, 216 జాతీయ రహదారి గుండా కోనసీమ, కాకినాడలవైపు ప్రయాణించేవారితో ఈ ప్రాంతం సాయంత్ర సమయాల్లో అత్యంత రద్దీగా ఉంటుంది. సర్వీస్ రోడ్డును ఆక్రమించి వాహనాలు యథేచ్ఛగా పార్కింగ్ చేసి మద్యం దుకాణాలకు వెళ్లొచ్చే వారి గందరగోళమూ ఇక్కడ ఉంటుంది. ఇలాంటి ప్రమాదకర ప్రాంతంలో యానాం ప్రజాపనులశాఖ రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు రెండేళ్ల నుంచి వెలగడం లేదు. ఇందిరాగాంధీ, నెహ్రూ విగ్రహాల వద్ద మూడు రోజుల క్రితం కొత్త లైట్లు ఏర్పాటు చేయగా ఇందిరమ్మ విగ్రహం వద్ద లైట్లు వెలగడం లేదు. గురువారం రాత్రి ఈ ప్రాంతం చిమ్మచీకటిగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు జనం ఇబ్బందిపడ్డారు. ముఖద్వారం లైట్లు వెలగకపోవడంపై ప్రజాపనుల శాఖ ఇన్‌ఛార్జి ఈఈ నాగరాజును ప్రశ్నించగా, కొత్త లైట్లువేసి మూడు రోజులే అయ్యిందని, తనిఖీ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. రూ.5 లక్షలతో రాజీవ్‌బీచ్‌లో కొత్తగా లైట్లు వేయించామన్నారు.

వరద బాధితులకు సాయం


కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాట్రేనికోన: విజయవాడలో ఇటీవల వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు కాట్రేనికోనలోని చెయ్యేరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అండగా నిలిచారు. సేకరించిన రూ.50 వేల చెక్కును వరద బాధితుల సహాయం కోసం గురువారం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అందించారు. ఆయన విద్యార్థులను అభినందించారు. జి.సూర్యప్రకాశం, శేషసాయి, వెంకటరమణ, చెల్లి సురేష్, నారాయణస్వామి, జి.సూర్యమహాలక్ష్మి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

మండపేట

•మండపేట •రామచంద్రపురం



ముమ్మరంగా పూడిక తొలగింపు పనులు

మండపేట, న్యూస్‌టుడే: అంటు వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రధాన, సాధారణ డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ టి.వి.రంగారావు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టరు ఎం. సత్తిరాజు పర్యవేక్షణలో ప్రధాన రహదారిలో గల మేజరు డ్రెయిన్లలో గురువారం పూడిక తొలగించారు.

ప్రధాన డ్రెయిన్‌లో పూడిక తొలగిస్తున్న కార్మికులు

రూ.2.5 కోట్లతో మూడు రహదారుల నిర్మాణం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలంలో అధ్వానంగా మారిన మూడు రహదారులను రూ.2.53 కోట్లతో బీటీ రోడ్లుగా నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మండల ఇంజినీరింగు అధికారి ఏసురాజు తెలిపారు. వెల్ల నుంచి వెల్లసావరం మీదుగా కందులపాలెం వరకు రోడ్డు రూ.94.50 లక్షలు, ద్రాక్షారామ నుంచి ఆదివారపుపేట మీదుగా వెల్లకు రూ.106.05లక్షలు, యనమదల నుంచి నరసాపురపుపేట వరకు రూ.52.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఉదయం వెల్ల లాకుల వద్ద శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ.10 గం. నుంచి మ. ఒంటి గంట వరకు

ద్రాక్షారామ: 80085 74192, ద్వారపూడి: 91543 96553

సమస్య: ఏడిద దేవుడు కాలనీలో వీధి దీపాలు వారం రోజులుగా సక్రమంగా వెలగడం లేదు. రాత్రి సమయంలో సంచారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- వెంకట్రావు, ఏడిద
సమాధానం: వీధి దీపాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపడతాం.
-వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి

సమస్య: తాపేశ్వరం నుంచి అర్తమూరు వెళ్లే కాలువలో దేవుడు స్థలం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి. నీటి పారుదలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి.
- సత్తిబాబు, తాపేశ్వరం
సమాధానం: ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపునకు లస్కర్లకు సూచనలు ఇస్తాం.
- అజీజ్, జేఈ, జలవనరులశాఖ

సమస్య: మండపేట మండలం జడ్.మేడపాడు ఎస్సీ కాలనీ వాటర్ ట్యాంకు వీధిలో దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల ఇబ్బందిగా ఉంటోంది. సమస్య పరిష్కరించాలి.
-డి.సురేంద్ర, జడ్.మేడపాడు
సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
-అమర్‌నాథ్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, ద్వారపూడి, మండపేట గ్రామీణం

క్రీడా దుస్తులు అందజేత

మండపేట: స్థానిక ఎస్సీఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్నికాయిట్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగభూషణం, డాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్ళకూరి గోళ్లబాబు చేతుల మీదుగా గురువారం క్రీడా దుస్తులు అందజేశారు. రోటరీ సభ్యులు మాజేటి నారాయణ, చెన్న సుబ్రహ్మణ్యం గుప్త, మోగంటి రామ్‌కుమార్, పెండ్యాల ప్రదీప్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ద్వారపూడి: స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా మండపేట మండలం కేశవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరిసరాల శుభ్రత అనే అంశంపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామని, వచ్చేనెలలో జరిగే గ్రామసభలో విజేతలకు బహుమతులు అందజేస్తామని పంచాయతీ కార్యదర్శి ఎస్.వి. సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని జి.మాలతి, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి

రాయవరం: పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి చంద్రమళ్ల రామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, శానిటైజర్లు అందజేశారు. పంచాయతీ వార్డు సభ్యులు పుండవిల్లి రాంబాబు, కార్యదర్శి ఎస్.ధనలక్ష్మి పాల్గొన్నారు.

బాలికను మోసగించిన కేసులో నిందితుడి అరెస్టు

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసగించిన రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన లోకిట్టి సతీష్‌ను మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్సై సురేశ్‌బాబు బృందం గురువారం అరెస్టు చేశారు. ఆలమూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండు విధించడంతో రామచంద్రపురం సబ్‌జైలుకు తరలించినట్లు వారు తెలిపారు.

కంటి వైద్యం ఎలా..?

మూతపడిన 'ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం'

న్యూస్‌టుడే, మండపేట

మండపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం మూతపడింది. 2018లో అప్పటి సీఎం చంద్రబాబు ఆలోచనతో దీనిని ఏర్పాటు చేశారు. తొలినాళ్లలో కంటి సంబంధ సమస్యలతో బాధపడే వారు అధిక సంఖ్యలో పరీక్షలు చేయించుకునే వారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంగా నిర్లక్ష్యం నీడలు కమ్ముకున్నాయి. 15 రోజుల కిందట ఇందులో పరీక్షల నిర్వహించే ఖరీదైన పరికరాలు సైతం తరలించుకుపోయారు.



కేంద్రం వద్ద ఓపీ (పాత చిత్రం)



పరీక్షలు నిర్వహించే పరికరాలు

అత్యాధునిక పరికరాలతో పరీక్షలు..

ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రంలో అత్యాధునిక పరికరాలతో నేత్ర పరీక్షలు చేయడంతోపాటు కళ్లజోళ్లు ఉచితంగా అందించే వారు. ఖరీదైన నేత్ర వైద్యం బయట ఆసుపత్రుల్లో చేయించుకోలేని నిరుపేదలు ఇక్కడకు వచ్చేవారు. ఆధునిక పరికరాలతో కంటి శుక్లాలకు పరీక్ష నిర్వహించే వారు. ప్రస్తుతమున్న సమస్యలే కాకుండా రానున్న కాలంలో ఎదురవడానికి అవకాశమున్న సమస్యలను కూడా ముందుగానే గుర్తించడంతోపాటు నివారణ చర్యలు వివరించారు. ఆధార్ నంబరు నమోదు చేసుకుని పరీక్ష నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేవారు. గుత్తేదారు సంస్థ అపోలో చెన్నై ఆసుపత్రి వర్గాలు ఆ వివరాలను పరిశీలించి తగిన సూచన చేస్తూ వెంటనే సమాచారం ఇచ్చేవారు. దీంతో కార్పొరేట్ పద్ధతిలో నేత్ర పరీక్షలు, చికిత్స చేయడం వల్ల ఎంతో మందికి కేంద్రంపై నమ్మకం కుదిరింది. శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సిన ఇక్కడి అప్తాల్మిక్ అసిస్టెంట్ సూచనల మేరకు రాజమహేంద్రవరం, కాకినాడలో నిర్వహించే వారు. రోజూ సామాజిక కేంద్రంలో ఓపీ 350 మంది ఉంటే.. ఈ కేంద్రానికి 40 నుంచి 50 వరకు వచ్చేవారు. మండపేటతోపాటు పరిసర గ్రామాల నుంచి సైతం ఇక్కడకు వచ్చి పరీక్షలు చేయించుకునేవారు. కళ్లజోళ్లు అవసరమైన వారు కావాల్సిన మోడల్ ఎంపిక చేసుకునే వెసులుబాటు కూడా ఉండేది. ప్రస్తుతం అటువంటి సేవలు నిలిచిపోయాయి. అలవాటు ప్రకారం నేత్ర పరీక్షల కోసం వచ్చిన వారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రం మూతపడడం తాత్కాలికమేనని చెబుతున్నా.. ఇందులో పనిచేసే సహాయకులను ఇంటికి పంపేయడంతో పునఃప్రారంభంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్థికంగా భారమే..



కంటి పరీక్షలు చేయించుకునేందుకు ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ఇది మూతపడడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఇది ఆర్థికంగా భారమవుతోంది. ప్రస్తుతం 20 సంవత్సరాలు పైబడిన వారికి సైతం కళ్లజోడు అవసరమవుతోంది.
- వెంకట్రావు, మండపేట

పాఠశాలల్లో పరీక్షలు చేస్తున్నాం..



అపోలో ఎంఓయూ పూర్తవడం వల్ల ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం 15 రోజుల కిందట మూతపడింది. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు 26 వేలకు పైగా పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు ఉచితంగా అందించాం. వందల సంఖ్యలో శుక్లాల శస్త్రచికిత్సలు చేయించాం. ఇప్పటికీ తెలియక ఎంతో మంది ఆసుపత్రికి వచ్చి వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నా. మండపేట వంటి కేంద్రంలో పూర్తిస్థాయిలో నేత్ర పరీక్ష కేంద్రం అందుబాటులో ఉంటే ఎంతో మంది పేదలకు ప్రయోజనం చేకూరుతుంది. త్వరలో మళ్లీ ఒప్పందం చేసుకుని కేంద్రం పునఃప్రారంభిస్తామని ఉన్నతాధికారులు అంటున్నారు.
- ఎస్.వి.వి.సత్యనారాయణ, కంటి వైద్యుడు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నేడు



రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు రామచంద్రపురం డీఈఈ రత్నాలరావు తెలిపారు. ఈ కారణంగా రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద, లొల్ల, సోమేశ్వరం, పసలపూడి, మాచవరం, అనపర్తి మండలంలోని మహేంద్రవాడ, బిక్కవోలు మండలంలోని కొమరిపాలెం గ్రామాల్లో విద్యుత్తు అంతరాయం కలుగుతుందన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోగల వెంకటాయపాలెం పీడరు మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ కారణంగా తోటపేట, అన్నాయిపేట, వేగాయమ్మపేట, వెంకటాయపాలెం, దాసరిపాడు, యల్లంపల్లి, చిన్నంపేట గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుంది.

రామచంద్రపురం: ద్రాక్షారం గ్రామీణ పీడర్‌పై శుక్రవారం అత్యవసర మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ద్రాక్షారం, నరసాపురపుపేట, ఓదూరు, ఉండూరు, మండలంలోని ఆరికరేవుల, అంబికా అగ్రహారం, రైసుమిల్లు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ తెలిపారు.

మండపేట గ్రామీణం: మండపేట పట్టణంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని సంబంధిత డీఈ శ్రీధర్ వెల్లడించారు. పట్టణంలో మారేడుబాక రోడ్డు, ఆనంద్ కాలనీ, వీర్రాజునగర్, పాటిమీద, తహసీల్దారు కార్యాలయం వీధి, తెనుకుల వీధి, న్యూకాలనీ, కొండపల్లివారి వీధి, బురుగుంటచెరువు, ఎంపీడీవో కార్యాలయం, బాపూజీ స్కూలు పరిసర ప్రాంతాలు, బ్యాంక్ కాలనీ, గొల్లలగుంట, సూర్యానగర్‌లో సరఫరా నిలిపివేస్తున్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం

అంగర, న్యూస్‌టుడే: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నారని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆయన గురువారం కపిలేశ్వరపురం మండలం అంగర వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం ప్రారంభించిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్ల పెంపు, భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం వంటి ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. వచ్చే దీపావళి నాటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలుకు కూటమి ప్రభుత్వం వేస్తోందని తెలిపారు. అలాగే దశల వారీగా ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి నాయకులు చూపిన తెగువను ప్రశంసించారు. 2019లో ఒక్క చాన్స్ అంటూ వచ్చిన వైకాపా ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడంతోపాటు వ్యవస్థలను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్, రెడ్డి ప్రసాద్, పుష్యం చిట్టిబాబు, నెక్కంటి ప్రసాద్, సర్పంచ్ కోటేశ్వరరావు, ఉప సర్పంచి ఉద్దా వీరన్న, ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మంత్రి సుభాష్ పరామర్శ

పామర్రు: కె.గంగవరం మండలం సత్యవాడ, తామరపల్లి, సుందరపల్లి, కోటిపల్లి తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను గురువారం మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆయా గ్రామాల కూటమి నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని, గర్భిణులు రోజూ తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం సామూహిక సీమంతాల్లో భాగంగా గర్భిణులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్త హీనతను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, బాల సంజీవని పథకం ద్వారా అనుబంధ పోషకాహారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పీఏసీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, గరిసపాటి సత్యనారాయణమూర్తి, సీడీపీవో వరహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణికి సీమంతం కిట్ అందిస్తున్న మంత్రి సుభాష్

సీపీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఉండూరులో గురువారం రాత్రి జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉండూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రిలో సీపీఎస్సార్ నిధులతో 50 పడకలు ఏర్పాటు చేయనున్నారు. గోదావరి పుష్కరాలకు మంజూరయ్యే నిధులతో నియోజకవర్గంలో జీర్ణావస్థకు చేరిన ఆలయాల అభివృద్ధి చేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నయం కాని రోగాలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి వరలక్ష్మి, తహసీల్దారు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కీర్తిస్పందన, గ్రామస్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో శ్మశాన వాటికల అభివృద్ధి..

ద్రాక్షారామ: రామచంద్రపురం నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలను

'వెంకన్న ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న ముఖ్యమంత్రి'

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ దురుద్దేశానికి నిరసనగా ఈనెల 28న కలువపువ్వు సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించనున్నట్లు మండపేట వైకాపా ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడారు. వెంకటేశ్వరస్వామి వారి విశిష్టతను అపవిత్రం చేశారని, దానికి ప్రక్షాళన చేసేందుకు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. వైకాపా నాయకులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు భారీగా ఆలయం వద్దకు చేరుకోవాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు.

'ఎమ్మెల్సీ తోట ఆలయానికొస్తే అడ్డుకుంటాం'

మండపేట గ్రామీణం: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈ నెల 28న వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికొస్తే అడ్డుకుంటామని, ఈ కార్యక్రమానికి కూటమి శ్రేణులు తరలిరావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ పవిత్రత గురించి ఎమ్మెల్సీ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని విమర్శించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో దేవాదాయ భూములు ఆక్రమణల దొంగలకాని ప్రజా రవాణా ఆస్తులని తిరిపే అర్హులు తోట త్రిమూర్తులు కాదా? అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే స్థాయి వారికి లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించి నెయ్యి కల్తీ జరగడం వాస్తవమేనన్నారు.

రహదారిపై గుంతలు.. చోదకుల అవస్థలు



కోరుమిల్లిలో రహదారిపై భారీ గుంత



కపిలేశ్వరపురంలో..

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం తాతపూడి నుంచి కోరుమిల్లి వరకు ఏటి గట్టు రహదారి అధ్వానంగా మారింది. రహదారిపై భారీగా గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనబడక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాతపూడి, కపిలేశ్వరపురం స్లాక్ పాయింట్ల పరిధిలో సుమారు రెండుకిలో మీటర్ల మేర రహదారి అంచులు పూర్తిగా పాడయ్యాయి. ఇసుక లోడులతో భారీగా లారీలు తిరగడంతో అంచులు సుమారు అడుగులు తుకు కుంగిపోయాయి. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి, కనీస మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఈశ్వరరావు.. స్పందన భేష్

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట-కపిలేశ్వరపురం ఆర్.అండ్.బి శాఖ రహదారిలో మారేడుబాక పార్వతీనగర్ వద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. వాటిని తప్పించుకొని ముందుకు వెళ్లే క్రమంలో వాహనాలు అదుపుతప్పి చోదకులు, ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ విషయం అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికెళ్లినా స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో మండపేట పాటిమీదకు చెందిన ఈశ్వరరావు స్పందించారు. తన ఇంటి వద్ద, నిర్మాణాలు జరిగే కంకర సేకరించి తీసుకొచ్చి గుంతలో వేశారు. దీనివల్ల కొంత వరకైనా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



గుంత పూడుస్తున్న ఈశ్వరరావు

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

రామచంద్రపురం, న్యూస్‌టుడే: స్థానిక మోడరన్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. 25 మందికి ప్రతిభగల విద్యార్థులకు బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత జి.వి.రావు, ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టర్ కె.సాయిరామచౌదరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి విగ్రహ నిమజ్జనం

మండపేట గ్రామీణం: మండపేట మండలం జడ్.మేడపాడులో సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న మందిరంలోని గణపతి విగ్రహ నిమజ్జన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. తీన్మార్ డప్పులు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య గ్రామోత్సవం జరిగింది. అనంతరం విగ్రహానికి వేమగిరి- సామర్లకోట కెనాల్‌లో కమిటీ సభ్యులు, గ్రామస్థులు నిజ్జనం చేశారు.

ఆక్రమిత స్థలంలో బడ్డీ తొలగింపు

ద్రాక్షారామ: ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ర.భ.శాఖ స్థలాన్ని, పంటబోదెను ఆక్రమించి ఏర్పాటు చేసిన కిళ్లీ బడ్డీని గురువారం తొలగించారు. ఇటీవల గ్రామసభకు హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆ ఆక్రమణ గురించి ప్రజలు విన్నవించడంతో తొలగించాలని ఆయన పంచాయతీ అధికారులను సూచించారు. దీనిపై ఈ నెల 6న బడ్డీ యజమానికి పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం నోటీసు జారీ చేసి విద్యుత్తు సరఫరా నిలిపివేయించారు. గురువారం క్రేన్ సాయంతో బడ్డీ తొలగిస్తుండగా యజమాని కూడా పంచాయతీ సిబ్బందికి సహకరించారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

అంగర: వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కపిలేశ్వరపురం భవిత కేంద్రం ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. సమగ్ర శిక్షాలో ఒప్పంద, పొరుగు సేవల విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రతి నెలా జీతాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదని ఐఈఆర్టీలు జి.సునీత, ఎంఎస్ఆర్ కల్యాణి అన్నారు. జేఏసీ పిలుపు మేరకు కపిలేశ్వరపురం భవిత కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన సమయంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉంచితే చిరు ఉద్యోగులు జీవనం ఎలా సాగించాలని ప్రశ్నించారు.



కపిలేశ్వరపురం భవిత కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రోజువారీ కార్మికులను కొనసాగించాలి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రోజువారీ వేతనంపై పని చేసే పారిశుద్ధ్య కార్మికులను 20 మందిని కొనసాగించాలని కౌన్సిలర్లు కోరారు. ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో పురపాలక అత్యవసర సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, వైస్ ఛైర్మన్ కోలమూరి శివాజీ మాట్లాడుతూ 20 మంది పారిశుద్ధ్య కార్మికులను ఏ ఏ వార్డుల్లో పని చేస్తున్నారో సంబంధిత కౌన్సిలర్ల దృష్టికి ఎప్పుడూ తీసుకురాలేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒక్క వార్డుకే పరిమితమయ్యారా? అని ప్రశ్నించారు. జనాలు లేని చోట పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారని ఆరోపించారు. రద్దీగా ఉండే మార్కెట్, సినిమా థియేటర్లు, దేవాలయాల కూడళ్లలో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. వార్డు సచివాలయాల్లో కొందరు ప్రణాళిక కార్యదర్శులు అవినీతికి పాల్పడుతున్నారని కొంత మంది కౌన్సిలర్లు ఆరోపించారు. పారిశుద్ధ్య, సంక్షేమ, ప్రణాళిక కార్యదర్శులను వార్డులోనే అంతర్గతంగా బదిలీలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మొదటి సమావేశంలో 7 అంశాలు, రెండో సమావేశంలో 4 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. డబుల్ ఎంట్రీ అసిస్టెంట్లు రద్దుకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ పార్కుల్లో పని చేస్తున్న కార్మికులకు గత మార్చి నుంచి నేటి వరకు జీతాలు ఇవ్వలేదని, వారి కుటుంబాలు ఎలా బతుకుతాయని కౌన్సిలర్లు నిలదీశారు. ఈ సమావేశాల్లో పురపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.